

నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365

WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక


సత్య శోధనే మా లక్ష్యం...

రంగారెడ్డి శనివారం 16-05-2026 సంపుటి: 02 సంచిక : 15 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Saturday, 16-05-2026 Volume :02 Issue: 15 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani



Contact Number
9059328777



## పెట్రోల్,డీజిల్
# ధరల పెంపు

- లీటర్‌పై కనీసంగా రూ.3 పెంపు
- శుక్రవారం ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయి.
- ధరలు పెంచుతూ ఆయిల్ కంపెనీల నిర్ణయం

**న్యూఢిల్లీ,**
ఊహించినట్లుగానే.. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. లీటరు పెట్రోల్‌పై సగటున రూ.3, డీజిల్‌పై రూ.3 పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. పెరిగిన ధరలు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయి. పశ్చిమాసియాలో కొనసాగుతోన్న సంక్షోభం నేపథ్యంలో.. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరిగాయి. అయినప్పటికీ.. ప్రభుత్వరంగ చమురు కంపెనీలు దాదాపు 11 వారాల పాటు ఇంధన ధరలను స్థిరంగా ఉంచాయి. అయితే, అవి తీవ్ర ఆర్థికఒత్తిళ్లు ఎదుర్కొంటున్న నేపథ్యంలో.. లీటరుకు రూ.3 పెంచి వాహనదారులపై కొంత భారాన్ని మోపాయి. 2022 ఏప్రిల్ నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు దాదాపు మారలేదు. అయితే, లోక్‌సభ ఎన్నికలకు ముందు 2024 మార్చిలో లీటరుకు రూ.2 చొప్పన తగ్గించాయి. తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో

-మిగతా 2 లో




# నీట్ రీఎగ్జామ్..

**జూన్ 21న నిర్వహణ**

- అదే నెల 14 నుంచి విద్యార్థులకు అడ్మిట్ కార్డులు
- ఉచితంగానే రీ ఎగ్జామ్‌కు అందరికీ ఎంట్రీ
- వచ్చే ఏడాది నుంచి ఆన్‌లైన్‌లోనే పరీక్ష
- ఎంట్రన్స్ పరీక్షల్లో సమూల మార్పులు
- విద్యార్థులకు భరోసా ఇచ్చిన కేంద్ర మంత్రి ధర్మేంద్ర

2 లో

**గతంలో ఎగ్జామ్ రాసిన వారికి ఫీజు రిటర్న్**

## 2034 వరకు నేనే
# ముఖ్యమంత్రి

### ఆ తరవాత జాతీయ రాజకీయాల్లోకి వెళతా



- రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యంగా పనిచేస్తా
- రాహుల్ తరవాత సెకండ్ ప్లేస్ ఆక్రమిస్తా
- దేశంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే రాహుల్ గాంధీ లక్ష్యం
- కాని ఆయనకు ప్రధాని కావాలనే కోరిక లేదు
- గాంధీ కుటుంబానికి దేశం పట్ల విశ్వాసం ఉంది
- పదిశాతం జీడీపీని తెలంగాణ దేశానికి ఇచ్చేలా పనిచేస్తా
- రాహుల్ గాంధీని ప్రధానిని చేసిన తర్వాత.. ఆయన ఏ బాధ్యతలు అప్పగించిన తీసుకుంటా
- సీఎం రేవంత్ రెడ్డి మరోమార్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, మే 15 (నేటి దర్శిని)**
తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 2034లో రాష్ట్రంలో కాంగ్రెస్‌ను గెలిపించి జాతీయ రాజకీయాల్లోకి వెళ్తానని చెప్పారు. అప్పటి వరకు తానే సీఎంగా ఉంటానన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే తన లక్ష్యమని చెప్పారు. జాతీయ రాజకీయాల్లోకి వెళ్లి రాహుల్ తర్వాతి స్థానంలో ఉంటానని వ్యాఖ్యానించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే రాహుల్ గాంధీ లక్ష్యమన్నారు. ఆయనకు ప్రధాని కావాలనే కోరిక లేదని.. ఆ పదవికి పోటీ పడాలని తాను ఒప్పించానని రేవంత్ చెప్పారు. గాంధీ కుటుంబానికి దేశం పట్ల విశ్వాసం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

-మిగతా 2 లో



## ఇందిరమ్మ ఇండ్ల మంజూరు
# నిరంతర ప్రక్రియ

- జూన్ 2న ఆదిలాబాద్ నుంచి రెండో విడత ప్రారంభం
- గూడులేని ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు
- జాయింట్ సర్వేతో భూ సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం

**హైదరాబాద్, మే 15 (నేటి దర్శిని)**
పేద కుటుంబానికి సొంత ఇల్లు అనేది కేవలం నివాసం మాత్రమే కాదని, అది వారి ఆత్మ గౌరవానికి, భద్రమైన భవిష్యత్తుకు ప్రతీకని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల మంజూరును నిరంతరం కొనసాగించే ప్రక్రియగా చేపట్టిందన్నారు. గూడులేని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు సమకూర్చడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇవ్వని విధంగా ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయంతో (వంద శాతం సబ్సిడీతో) పేదల ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టి తెలంగాణ ప్రభుత్వం దేశానికి తలమానికంగా నిలిచిందన్నారు. రెవెన్యూ, హౌసింగ్ అంశాలపై జిల్లాల వారీగా ప్రజా ప్రతినిధులతో నిర్వహిస్తున్న సమావేశాల్లో భాగంగా శుక్రవారం

-మిగతా 2 లో




## ఆన్ లైన్ లోనే
# మహానాడు

- చంద్రబాబు సంచలన నిర్ణయం
- పొదుపు చర్యలు ప్రకటించిన ప్రధాని మోదీ
- నెల్లూరులో మహానాడు నిర్వహణకు ఇప్పటికే ముమ్మర ఏర్పాట్లు
- మోదీ పిలుపు నేపథ్యంలో చంద్రబాబు కీలక నిర్ణయం
- హైబ్రిడ్ విధానంలో రెండ్రోజుల పాటు టీడీపీ మహానాడు
- ఎన్టీఆర్ భవన్ లో స్టేజి ఏర్పాటు... రాష్ట్రవ్యాప్తంగా స్క్రీన్లపై ప్రసారం

**అమరావతి: మే 15 (నేటి దర్శిని)**
టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు సంచలన నిర్ణయం తీసుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు పొదుపు చర్యల్లో భాగంగా టీడీపీ మహానాడు కార్యక్రమాన్ని ఈ ఏడాది కేవలం ఆన్ లైన్ లోనే జరపాలని నిర్ణయించారు. వాస్తవానికి ఈ నెల 27, 28, 29 తేదీల్లో నెల్లూరులో ఘనంగా మహానాడు నిర్వహించేందుకు ఏర్పాట్లు కూడా ముమ్మరంగా జరుగుతున్నాయి.

-మిగతా 2 లో

# ముందుగానే నైరుతి రుతుపవనాలు



- ఏపీ, తెలంగాణకు వర్ష సూచన
- ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు సాధారణం కంటే ముందుగానే
- మే 26న కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందంటున్న వాతావరణ శాఖ
- రుతుపవనాల ప్రభావంతో దక్షిణ భారతంలో ఉష్ణోగ్రతలు తగ్గి ఉక్కపోత తగ్గే అవకాశం
- ఏపీలో అల్పపీడనం ప్రభావంతో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం
- గంటకు 30--40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ
- తెలంగాణలోనూ కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం

2 లో



# ఎన్నికలు కాగానే పెట్రోల్ ధరలు పెంచారు

- మోడీ వైఫల్యానికి ఇది నిదర్శనం
- మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శ

**హైదరాబాద్, మే 15 (నేటి దర్శిని)**
ఎన్నికలు పూర్తి కాగానే పెట్రోల్ ధరలు పెంచి బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలను మోసం చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దేశంలో నాలుగు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయ్యే వరకు అందరూ ఊహించిన విధంగా పెట్రోల్ డీజిల్ పెంచకుండా ఆపారన్నారు. ఎన్నికలు పూర్తికాగానే ముఖ్యమంత్రుల ప్రమాణ స్వీకారం కూడా కాకముందే

-మిగతా 2 లో



# రూపాయి విలవిల

- చరిత్రలో మొదటిసారిగా డాలర్‌తో మారకపు విలువ రూ. 96లకు దిగువన నమోదు
- ఈ సంవత్సరం 6 శాతం నష్టం
- వేగంగా రూపాయి క్షీణత
- 96-98 వరకు క్షీణించే అవకాశం
- భారీగా పెరుగుతున్న దిగుమతుల బిల్లు

**న్యూఢిల్లీ: మే 15 (నేటి దర్శిని)**
అమెరికా డాలర్‌తో పోల్చితే రూపాయి మారకపు విలువ శుక్రవారం నాడు భారీగా పతనమైంది. చరిత్రలో మొదటిసారి డాలర్‌తో రూపాయి విలువ 96.14 రూపాయలకు క్షీణించింది. చివరికి 95.86 వద్ద కనిష్టస్థాయిలో ముగిసింది. ఈ సంవత్సరం ఇప్పటి వరకు రూపాయి 6 శాతానికి పైగా పతనమైంది. ఇరాన్ యుద్ధ ప్రభావం పెరగడంతో ముడి చమురు ధరలు పెరుగుతున్నాయి. దీంతో గడిచిన ఆరు ట్రేడింగ్ సెషన్లలో రూపాయి అత్యంత వేగంగా 2 శాతం మేర క్షీణించింది. అమెరికాలో బలమైన రిటైల్ అమ్మకాలు, స్థిరమైన కార్మిక మార్కెట్ డేటా, ఫెడరల్ రిజర్వ్ భారీగా వడ్డీ రేట్లను తగ్గిస్తుందనే అంచనాలను తగ్గించడంతో డాలర్ ఇండెక్స్ బలపడింది.

-మిగతా 2 లో



# ఆత్మహత్యలు కావు.. వ్యవస్థలు చేసిన హత్యలు

- నీట్ విద్యార్థుల ఆత్మహత్యపై రాహుల్ ఆందోళన
- ప్రభుత్వం ఎప్పుడు కళ్లు తెరుస్తుందని ప్రశ్న

**న్యూఢిల్లీ, మే 15 (నేటి దర్శిని)**
నీట్ పరీక్షల రద్దుతో ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థులవి వ్యవస్థలు చేసిన హత్యలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నీట్ పరీక్షలకు సంబంధించిన ఆత్మహత్య ఘటనలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల కుంభకోణాలు, అవినీతి కారణంగా విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతోందని ఆరోపించారు. సోషల్ మీడియా వేదికగా రాహుల్ గాంధీ పోస్టు పెట్టారు. లఖింపూర్ ఖేరీకి చెందిన 22 ఏళ్ల హృతిక్ మిశ్రా చివరిసారిగా 'నేను ఇకపై పోటీ పరీక్షలు రాయను' అని చెప్పిన మాటలను ప్రస్తావిస్తూ రాహుల్ గాంధీ భావోద్వేగానికి గురయ్యారు. మూడోసారి నీట్ పరీక్ష రాస్తున్న హృతిక్, పరీక్ష రద్దు కావడంతో తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్య

-మిగతా 2 లో

## కేసీఆర్..
# ఓ రోబో!

### సీఎం అయిన తర్వాతే ఆయనలో మార్పు



- కేసీఆర్ కేవలం ఒక యంత్రంలా పనిచేశారు
- అందుకే ప్రజల భావోద్వేగాలు అర్థం కావు
- తనకే స్వేచ్ఛగా సమస్యలు చెప్పుకునే అవకాశం లేదు
- ఉద్యమ నాయకుడిగా ఆయన గొప్ప వ్యక్తి
- మరోసారి కేసీఆర్ పై కవిత కామెంట్స్

**హైదరాబాద్, మే 15 (నేటి దర్శిని)**
ప్రస్తుతం కేసీఆర్ ను ఒక 'మరమనిషి' (రోబో)గా తెలంగాణ రక్షణ సేన అధినేత కల్వకుంట్ల కవిత అభివర్ణించారు. పరిపాలనా కాలంలో కేసీఆర్ కేవలం ఒక యంత్రంలా పనిచేశారని, అందుకే ఆయనకు ప్రజల భావోద్వేగాలు అర్థం కాలేదని విమర్శించారు. హైదరాబాద్ లో ఒక మీడియా సంస్థ శుక్రవారం నిర్వహించిన కాన్ క్లేవ్ లో మాట్లాడారు. ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ ఎప్పుడూ

-మిగతా 2 లో

## పెట్రోల్,డీజిల్ ధరల పెంపు

మొదటి తరువాయి

దేశంలో ఇంధన ధరలు పెరుగుతాయంటూ ఇటీవల పెద్దఎత్తున ప్రచారం జరిగింది. అయితే, సరిపడా నిల్వలు ఉన్నాయంటూ కేంద్రం వాటిని ఎప్పటికప్పుడు తోసిపుచ్చుతూ వచ్చింది. ఈ క్రమంలో ధరలు పెంచడం గమనార్హం. కాగా.. ఈ ప్రకటనలకు ముందే ఇంధన ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందనే వార్తలు దేశంలోని వాహనదారులను ఆందోళనకు గురిచేశాయి. దీంతో పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరారు. ఈ క్రమంలో కొన్ని బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. సీఎన్‌జీ వాహనదారులకు కూడా గ్యాస్ కంపెనీలు షాకిచ్చాయి. కిలో సీఎన్‌జీని రూ.2 చొప్పున పెంచాయి. ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై రూ3.29, డీజిల్‌పై రూ.3.14, తెలంగాణలో పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున ఆయిల్ కంపెనీలు పెంచాయి. పెట్రోల్ ధరలు: దిల్లీలో రూ.97.77, కోల్‌కతాలో 108.74, ముంబయిలో 106.68 , చెన్నైలో 103.67 (?2.83)గా ఉండనున్నాయి. ఇక డీజిల్ ధరలు: దిల్లీలో 90.67, కోల్‌కతాలో 95.13, ముంబయి 93.14, చెన్నైలో 95.25గా ఉండనున్నాయి. దాంతో దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో వీటి ధరలు మారాయి. పశ్చిమాసియాలో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచంలో ముడి చమురు ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచాలని ఆయిలు కంపెనీలు నిర్ణయించాయి. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ మాసాల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై రూ.3.29, డీజిల్‌పై రూ.3.14పై పెంచాయి. తెలంగాణలో పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున ధరలు పెంచాయి.

## ఆన్ లైన్ లోనే మహానాడు

మొదటి తరువాయి

అయితే, ప్రధాని మోదీ పశ్చిమాసియా సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని ఇంధన పొదుపుపై జాతికి దిశానిర్దేశం చేశారు. ఇప్పటికే ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రులు పొదుపు చర్యలు పాటిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇప్పుడు మహానాడును ఆన్ లైన్ లో హైబ్రిడ్ విధానంలో నిర్వహించాలని ప్రకటించడం ద్వారా ఆ పొదుపు చర్యలను మరింత ముందుకు తీసుకెళ్లారు. ఆన్ లైన్ లో మహానాడును ఈ నెల 27, 29 తేదీల్లో నిర్వహించనున్నారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్ లో ఒక వేదిక నిర్మించి దానిపై పొలిట్ బ్యూరో సభ్యులు ప్రసంగించనున్నారు. ఈ హైబ్రిడ్ మహానాడు కోసం రాష్ట్రవ్యాప్తంగా 1,845 క్లస్టర్లలో ఎలక్ట్రానిక్ స్క్రీన్లు ఏర్పాటు చేయనున్నారు. ఎన్టీఆర్ భవన్ నుంచి పొలిట్ బ్యూరో సభ్యులు పాల్గొనేలా ఏర్పాట్లు చేయనున్నారు.

## ఎన్నికలు కాగానే పెట్రోల్ ధరలు పెంచారు

మొదటి తరువాయి

దేశ ప్రజలకు ముఖ్యంగా తెలంగాణ ప్రజలకు పెట్రోల్ ధరలు పెంచి మరోసారి అన్యాయం చేసిందని వెల్లడించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్ పెట్రోల్ ధరలు పెరగవని చాలాసార్లు అన్నారని తెలిపారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం పెట్రోల్ ధరలు పెంచిందని గుర్తు చేశారు.గతంలో యూపీఏ ప్రభుత్వం నయా పైసా పెంచక ముందే గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోడీ అపహాస్యం చేసే విధంగా వ్యవహరిస్తుండే అని చెప్పారు. మూడు రోజుల క్రితం హైదరాబాద్ పర్యటనలో పెట్రోల్, డీజిల్ తక్కువ వాడండి బంగారం కొనవద్దు, నూనె తక్కువ వాడాలి అన్నప్పుడే నడ్డివిరుస్తారని అనుమానం వచ్చిందన్నారు. ఆరు నెలల స్టాక్ ఉందని చెప్పారు. యుద్ధం కారణం చూపుతున్నారని.. యుద్ధం ఈరోజు రాలేదు.. ఇప్పటి నుండో ఉందన్నారు. పెట్రోల్ డీజిల్ ధరలపై కాంగ్రెస్ పార్టీ అందరం కలిసి వ్యతిరేకిస్తున్నామని.. పెట్రోల్ ధరలపై బీజేపీ నేతలు స్పందించి ముక్కు నేలకు రాయాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

## కేసీఆర్.. ఓ రోబో!

మొదటి తరువాయి

గొప్ప వ్యక్తి అని, ఆ పాత్రలో ఆయనతో ఎవరికీ ఎటువంటి సమస్యలు లేవని ప్రశంసించారు. అయితే, ఆయన ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన తర్వాతే ప్రజలకు పూర్తిగా దూరమయ్యారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధినేతగా ఆయన ఎంత కఠినంగా ఉండేవారంటే, కన్నబిడ్డగా తనకే తన సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకునే అవకాశం ఉండేది కాదని ఆమె పేర్కొన్నారు. సొంత కుటుంబ సభ్యులకే అందుబాటులో లేని వ్యక్తి, ఇక సామాన్య ప్రజల కష్టాలను ఎలా వింటారని ఆమె ప్రశ్నించారు. ఉద్యమ నాయకుడి నుంచి ఒక యంత్రంలాంటి ముఖ్యమంత్రిగా కేసీఆర్ మారిన తీరే ప్రస్తుత రాజకీయ పరిణామాలకు కారణమని కవిత పేర్కొన్నారు.

## ఆత్మహత్యలు కావు.. వ్యవస్థలు చేసిన హత్యలు

మొదటి తరువాయి

చేసుకున్నాడని పేర్కొన్నారు. అలాగే ఉనీజీలో కూడా నీట్ పరీక్ష రాసిన మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడని గుర్తుచేశారు. ఈ ఘటనలు కేవలం ఆత్మహత్యలు కావని, అవినీతి వ్యవస్థ చేసిన హత్యలని రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పరీక్ష చేతిలో విద్యార్థులు ఓడిపోలేదు.. అవినీతి వ్యవస్థ చేతిలో బలయ్యారని అన్నారు. 2015 నుంచి 2026 వరకు దేశవ్యాప్తంగా 148 పరీక్షల కుంభకోణాలు వెలుగుచూశాయని ఆయన ఆరోపించారు. వాటిలో 87 పరీక్షలు రద్దయ్యాయని, దాదాపు 9 కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రభావితమైందని పేర్కొన్నారు. ఈ 148 కుంభకోణాల్లో కేవలం ఒక్కరికే శిక్ష పడిందని, సీబీఐ 17 కేసులు, ఈడీ 11 కేసులు నమోదు చేసినప్పటికీ ఎవరూ బాధ్యత వహించలేదని విమర్శించారు. ప్రత్యేకంగా నీట్, ఏఐపీఎంటీ మరియు ఇతర వైద్య ప్రవేశ పరీక్షల్లోనే 15 కుంభకోణాలు జరిగాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ వ్యవహారాల్లో బాధ్యులైన అధికారులు, మంత్రులు రాజీనామా చేయకపోవడం అత్యంత సిగ్గుచేటని అన్నారు. కొందరిని తొలగించినట్లు చూపించి, తిరిగి ఉన్నత పదవుల్లో నియమిస్తున్నారని ఆరోపించారు. మోసానికి సహకరించే వారికి బహుమతులు లభిస్తుండగా, పరీక్షలు రాసే పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారు అంటూ కేంద్ర ప్రభుత్వంపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రధాని మోడీని ఉద్దేశించి, మీలో జవాబుదారీతనం మేల్కొనడానికి ఇంకా ఎంతమంది హృతిక్‌లు కావాలని ప్రశ్నించారు. విద్యార్థుల బాధ తన బాధ అని, వారి భవిష్యత్తును దోచుకున్న వారు తప్పకుండా సమాధానం చెప్పాల్సి ఉంటుందని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఎంత కాలం పట్టినా సరే, ఎవరినీ వదిలిపెట్టం. ఈ యుద్ధాన్ని మనం కలిసి పోరాడదాం.. మనం గెలుస్తాం అంటూ ధైర్యాన్ని ఇచ్చారు.

## రూపాయి విలవిల

మొదటి తరువాయి

దేశీయ ఈక్విటీ మార్కెట్లలోకి విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు, ఎఫ్‌పీఐల ప్రవాహాలు తగ్గడంతో చెల్లింపుల బ్యాలెన్స్‌పై ఒత్తిడి పెంచుతున్నాయి. ఈ సంవత్సరం ఇప్పటి వరకు ఎఫ్‌పీఐలు దేశీయ మార్కెట్ల నుంచి 2 లక్షల కోట్లకు పైగా విలువైన ఈక్విటీలను విక్రయించారు. ప్రధానంగా చైనా, తైవాన్, దక్షిణ కొరియా మార్కెట్లకు ఈ పెట్టుబడులు తరలిపోతున్నాయి. ఈ కారణంగా కూడా రూపాయి మరింతగా బలహీనపడుతోంది. ముడి చమురు ధరలు పెరుగుతున్నందన ద్రవ్యోల్బణ ఆందోళనలు పెంచుతున్నాయి. ఇంటర్ బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్‌లో రూపాయి ఇంట్రాడే ట్రేడింగ్‌లో 50 పైసలు పతనమై రికార్డు కనిష్టానికి 96.14 రూపాయలు పతనమైంది. చివరికి క్రితం రోజు ముగింపుతో పోల్చితే 22 పైసలు పతనమై 95.86 రూపాయల వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ చమురు ధర 100 డాలర్లకు పైగా కొనసాగితే రూపాయి మరింత పతనం అయ్యే అవకాశం ఉందని ఫారెక్స్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ముడి చమురు ధరల ప్రభావంతోనే భారత్ హోల్ సేల్ ద్రవ్యోల్బణం ఏప్రిల్ నెలకు 8.3 శాతంగా నమోదైంది. ముడి చమురు దిగుమతి చేసుకునే ప్రతి దేశంలోనూ ధరల పెరుగుదల ఎక్కువగానే ఉంటుందని వీరు చెబుతున్నారు. రూపాయి గమనం కూడా ముడి చమురు ధరలతో ముడిపడి ఉంది. బ్యారెల్ ముడి చమురు ధర 80-90 డాలర్ల మధ్య ఉంటే రూపాయికి భారీ ఉపశమనం లభిస్తుంది. చమురు ధర తగ్గితే దిగుమతుల బిల్లు తగ్గి, కరెంట్ అకౌంట్ ఒత్తిళ్లు తగ్గుతాయి. ఫలితంగా డిసెంబర్ నాటికి రూపాయి విలువ 93-94 మధ్య ఉండే అవకాశం ఉంది. ప్రతికూల అంచనాల ప్రకారం బ్యారెల్ చమురు ధర ప్రస్తుతం ఉన్నట్లుగానే 100 డాలర్ల వరకు ఉంటే రూపాయి మరింత ఒత్తిడికి గురవుతుంది. ఫలితంగా ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి డాలర్‌తో మారకపు విలువ 96-98 రూపాయలకు క్షీణించే అవకాశం ఉంది.

# నీట్ రీఎగ్జామ్..

**-అదే నెల 14 నుంచి విద్యార్థులకు అడ్మిట్ కార్డులు**
**-గతంలో ఎగ్జామ్ రాసిన వారికి ఫీజు రిటర్న్**
**-ఉచితంగానే రీ ఎగ్జామ్‌కు అందరికీ ఎంట్రీ**
**-వచ్చే ఏడాది నుంచి ఆన్‌లైన్‌లోనే పరీక్ష**
**-ఎంట్రన్స్ పరీక్షల్లో సమూల మార్పులు**
**-విద్యార్థులకు భరోసా ఇచ్చిన కేంద్ర మంత్రి ధర్మేంద్ర**



**న్యూఢిల్లీ,**

దేశవ్యాప్తంగా వైద్య విద్య ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ యూజీ పరీక్ష విధానంలో కేంద్ర ప్రభుత్వం కీలక సంస్కరణలకు శ్రీకారం చుడుతోంది. వచ్చే ఏడాది నుంచి ఈ పరీక్షను పూర్తిగా కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానంలో నిర్వహించనున్నట్లు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు. జాతీయ ప్రవేశ పరీక్షల వ్యవస్థలో ఇది ఒక ప్రధాన సంస్కరణగా నిలవనుంది. ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... పేపర్ లీకేజీ కారణంగా రద్దు చేసిన నీట్ యూజీ 2026 పరీక్షను తిరిగి జూన్ 21న నిర్వహించనున్నట్లు ధృవీకరించారు. దీనికి సంబంధించిన అడ్మిట్ కార్డులను జూన్ 14 నాటికి జారీ చేస్తామని తెలిపారు. మే 3న పరీక్ష నిర్వహించగా, మే 7న "గెస్ పేపర్" గురించి ఆందోళనలు వ్యక్తమయ్యాయని, కొద్ది రోజుల్లోనే పేపర్ లీక్ అయినట్లు అధికారులు నిర్ధారించారని ఆయన వివరించారు.

**విద్యార్థుల భవిష్యత్తుతో రాజీ పడకూడదని..**

"లీకేజీ వాస్తవమని తేలిన వెంటనే, విద్యార్థుల భవిష్యత్తుతో రాజీ పడకూడదని నిర్ణయించుకుని మే 12న పరీక్షను రద్దు చేశాం" అని ప్రధాన్ పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో అక్రమాలను, అసాంఘిక శక్తులను ఏమాత్రం సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ పేపర్ లీకేజీ ఘటనపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ తో లోతైన విచారణ జరిపిస్తామని, దీని మూలాలను కనుగొనాలని ఏజెన్సీలను ఆదేశించినట్లు చెప్పారు. "కష్టపడి చదివే విద్యార్థులకు అన్యాయం జరగనివ్వం. విద్యార్థుల నమ్మకమే మాకు అత్యంత ముఖ్యం" అని ఆయన అన్నారు.

**ఇక.. 'జీరో-ఎర్రర్'**

గతంలో ఇలాంటి సంఘటనల నేపథ్యంలోనే రాధాకృష్ణన్ కమిటీని ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. ఆ కమిటీ సిఫార్సులను అమలు చేసినప్పటికీ, పరీక్షల నిర్వహణలో లోపం జరిగిందని అంగీకరించారు. సుప్రీంకోర్టు సిఫార్సు మేరకు ఏర్పాటైన ఎన్టీఏలో నిరంతర సంస్కరణలు జరుగుతున్నాయని, 'జీరో-ఎర్రర్' పరీక్షల నిర్వహణకు వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రద్దయిన పరీక్షకు హాజరైన అభ్యర్థులకు వారి పరీక్ష ఫీజును తిరిగి వాపసు ఇస్తామని, త్వరలో నిర్వహించే రీఎగ్జామ్ ను ఉచితంగా నిర్వహిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అభ్యర్థుల సౌలభ్యం కోసం పరీక్షకు వారం రోజుల ముందు తమకు నచ్చిన పరీక్షా నగరాన్ని ఎంచుకునేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, వీలైనంత వరకు రవాణా సౌకర్యాలు కూడా ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు.

## 2034 వరకు నేనే ముఖ్యమంత్రి

మొదటి తరువాయి

వ్యాఖ్యానించారు.. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తనకు చాలా చొరవ ఉందని పేర్కొన్నారు. తన గీత తాను దాటనని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్ వేదికగా సీఎం మాట్లాడారు. టీడీపీలో పదేళ్లు పనిచేశానని.. సీఎం చంద్రబాబు ఇప్పటికి తనను గౌరవిస్తారని ప్రస్తావించారు. పార్టీని వదిలిపెట్టిన తర్వాత నాయకుల మధ్య మంచి సంబంధాలు ఉండటం చాలా అరుదని తెలిపారు.. పార్టీని వదిలిపెట్టే సమయంలో విజయవాడకు వెళ్లి చంద్రబాబుకు చెప్పి వచ్చానని గుర్తుచేశారు.. కాంగ్రెస్‌ను దేశంలో అధికారంలోకి తేవాలని రాహుల్ గాంధీకి లక్ష్యం ఉందని...కాని ప్రధాని కావాలన్న లక్ష్యం లేదని స్పష్ట చేశారు. వికారాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో ప్రధాని పదవి తీసుకోవాలని తానే రాహుల్ గాంధీకి చెప్పి ఒప్పించానని ప్రస్తావించారు. ఇప్పుడు జనం స్విగ్గి పాలిటిక్స్ కోరుకుంటున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి నుంచి ప్రధాని అభ్యర్థి రాహుల్ గాంధీనే అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ముందు ప్రకటించి తర్వాత ఇండియా కూటమిని ఒప్పిస్తామని తెలిపారు. ఇండియా కూటమి తరుపున ఒక పాలసీ డాక్యుమెంటును తీసుకువచ్చి ప్రజలను తీర్పు ఇవ్వమని కోరతామని అన్నారు. 2024 నుంచి 2034 వరకు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తారని చెప్పుకొచ్చారు.. 2034 వరకు తాను తెలంగాణలోనే ఉంటానని.. ఈ ప్రజల కోసమే పనిచేస్తానని తెలిపారు. పదిశాతం జీడీపీని తెలంగాణ దేశానికి ఇచ్చేలా పనిచేస్తానని స్పష్టం చేశారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రినని చెప్పుకొచ్చారు. 2034 తర్వాత తాను ముఖ్యమంత్రిగా ఉండనని.. తర్వాత తరానికి అవకాశం ఇస్తానని తెలిపారు. దేశానికి కూడా సేవలందిస్తా అని.. తన అనుభవాన్ని దేశం కోసం పంచుతానని చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేసిన తర్వాత.. ఆయన ఏ బాధ్యతలు అప్పగించిన తీసుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల మంజూరు నిరంతర ప్రక్రియ

మొదటి తరువాయి

నాడు హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు, హౌసింగ్ డిపార్ట్ మెంట్ అధికారులతో మంత్రిగారు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాల్లో ఖమ్మం ఇన్ ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రులు దాసరి అనసూయ సీతక్క, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, పార్లమెంటు సభ్యులు వేం నరేందర్ రెడ్డి, పి.బలరాం నాయక్ తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరును విజయవంతంగా పూర్తి చేసి లక్షలాది పేద కుటుంబాల సొంత ఇంటి కలలను నెరవేర్చామని తెలిపారు. 3 లక్షలకు పైగా ఇండ్లను మంజూరు చేయగా, దాదాపు 2.90 లక్షల వరకు గ్రౌండింగ్ కాగా, ఇందులో ఇప్పటికే సుమారు 50 వేల గృహ ప్రవేశాలు కూడా జరిగాయని, అలాగే మరో రెండు లక్షలకు పైగా ఇండ్ల నిర్మాణం పనులు వివిధ దశల్లో ఉన్నాయని మరో రెండు నెలల్లో పూర్తి అవుతాయని తెలిపారు. నియోజకవర్గానికి 3500 ఇండ్లను మంజూరు చేయగా, ఐటీడీఏ ప్రాంతాల్లోని నియోజకవర్గాలకు అదనంగా ఇండ్లను మంజూరు చేశామని తెలిపారు. వచ్చే నెల రెండో తేదీన ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడత ఇండ్ల మంజూరు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని ఇది ఇంతటితో ఆగిపోదని అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే వరకు మూడవ, నాలుగవ విడతలుగా ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇరవై వేల వరకు ప్రభుత్వం నుంచి సహాయం పొందిన వారికి కూడా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ పైలట్ గ్రామాల్లో ఆరువందలకు పైగా చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇండ్లను నిర్మించిన వారి బిల్లులను క్లియర్ చేయాలని అధికారులను ఆదేశించారు. పేదవాడు తాను నివశిస్తున్న పూరి గుడిసె స్థానంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకుంటే, తమ ల్యాండ్ అంటూ ఫారెస్ట్ అధికారులు గానీ, సింగరేణి యాజమాన్యం కానీ అడ్డుపడొద్దని చెప్పారు. ఇండ్ల బేస్ మెంట్ కోసం చెరువులు, కుంటల నుంచి మట్టిని తరలిస్తే రెవెన్యూ పోలీసులు అడ్డు చెప్పకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నుంచి పేదల కోసం భూములను సేకరించి పట్టాలిచ్చారని, ఇందులో ఇంకా కొంత భూమి మిగిలే ఉందని దీనిని గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, రెవెన్యూ విభాగానికి సంబంధించి క్షేత్ర స్థాయిలోని స్థితిగతులపై ప్రజాప్రతినిధుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవడానికి, ఆయా నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలను తక్షణం పరిష్కరించే చర్యలు తీసుకునే క్రమంలోనే సమావేశాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజా ప్రతినిధుల సూచనలకు అనుగుణంగా వచ్చే నెలలో ప్రారంభం కానున్న ఇందిరమ్మ ఇండ్ల 2 విడత కార్యక్రమంలో అవసరమైన మార్పులు చేర్పులు చేస్తామన్నారు.

## ముందుగానే నైరుతి రుతుపవనాలు

**-ఏపీ, తెలంగాణకు వర్ష సూచన**
**-ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు సాధారణం కంటే ముందుగానే**
**-మే 26న కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందంటున్న వాతావరణ శాఖ**
**-రుతుపవనాల ప్రభావంతో దక్షిణ భారతంలో ఉష్ణోగ్రతలు తగ్గి ఉక్కపోత తగ్గే అవకాశం**
**-ఏపీలో అల్పపీడనం ప్రభావంతో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం**
**-గంటకు 30--40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ**
**-తెలంగాణలోనూ కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం**



**అమరావతి:**

భానుడి భగభగలతో అల్లాడుతున్న ప్రజలకు భారత వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు సాధారణ సమయం కంటే ముందే దేశాన్ని తాకే అవకాశం ఉంది అని వాతావరణ శాఖ పేర్కొంది. మే 26వ తేదీనే కేరళ తీరాన్ని రుతుపవనాలు తాకే అవకాశం ఉందని ఐఎండీ అధికారికంగా ప్రకటించింది. అంటే జూన్ 1న రావాల్సిన రుతుపవనాలు ఈ ఏడాది ఆరు రోజుల ముందే రావడం గమనార్హం. రుతుపవనాల రాకతో దక్షిణ భారత రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు తగ్గి, ఉక్కపోత నుంచి జనాలకు పెద్ద ఎత్తున ఉపశమనం లభించనుంది. అంతేకాదు ఖరీఫ్ పంటలు వేసే రైతులకు కాస్త ఉపశమనం లభించనుంది. ఇకపోతే నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతుంది. దీని ప్రభావంతో శనివారం తెలంగాణతో పాటు ఏపీలో ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

**ఏపీలో నేడు వర్షాలు**

నైరుతి బంగాళాఖాతం-పశ్చిమ మధ్య బంగాళాఖాతం సమీపంలో అల్పపీడనం కొనసాగుతోంది. రాగల 24 గంటల్లో కోస్తాంధ్ర, రాయలసీమ, యానాంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది అని తెలిపింది. సముద్ర మట్టానికి 5.8 కిలో మీటర్ల ఎత్తులో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని విశాఖపట్నం వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ అల్పపీడనం ప్రభావంతో శనివారం ఏపీలో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

ఎచచ కొప్పెర్లపాడులో అత్యధికంగా 43.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

ఇకపోతే ఆంధ్రప్రదేశ్‌లో శుక్రవారం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా ప్రకాశం జిల్లా కొప్పెర్లపాడులో 43.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆ తర్వాత ఎన్టీఆర్ జిల్లా తోటగూడెపాడులో 42.7 డిగ్రీలు, పల్నాడు జిల్లా గండిగనుమలలో 42.6 డిగ్రీలు, కర్నూలు జిల్లా నగరిడోనలో 42.2 డిగ్రీలు, కృష్ణా జిల్లా ఉయ్యూరులో 42.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.

**తెలంగాణలో 4 జిల్లాల్లో మోస్తరు వర్షాలు**

తెలంగాణ రాష్ట్రంలో శనివారం తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది. భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. అలాగే గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది అని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది.

**17 జిల్లాల్లో 41 పైగా డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు**

ఇకపోతే శనివారం తెలంగాణలో పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సైతం భారీగా నమోదయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. బంగాళాఖాతంలో తీవ్రమైన అల్పపీడనం కొనసాగుతున్నప్పటికీ పలు జిల్లాల్లో 41 కి పైగా డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఆదిలాబాద్, జగిత్యాల, జోగులాంబ గద్వాల్, కామారెడ్డి, కరీంనగర్, కొమురంభీం, మహబూబ్ నగర్, మంచిర్యాల, మెదక్, నాగర్ కర్నూల్, నారాయణపేట్, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల, వికారాబాద్, వనపర్తి జిల్లాల్లో 41 నుంచి 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.

# సాగు ఖర్చు తగ్గించుకుంటేనే అధిక లాభాలు...

- వ్యవసాయ శాస్త్రవేత్త అంజయ్య..
- రామ్నుంతల లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం...



**ఆమనగల్లు,మే15(నేటి దర్శిని):** పెట్టుబడిని తగ్గించి లాభదాయక వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేయాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విద్యాలయం శాస్త్రవేత్తలు సూచించారు. ఆమనగల్లు మండల పరిధిలోని రామ్నుంతలలో శుక్రవారం"రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు"అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు అంజయ్య, కనకదుర్గ రైతులకు సాగులోని మెలకువల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ రైతులు అవసరానికి మించి యూరియా,రసాయన ఎరువులను వాడటం వలన సాగు ఖర్చు పెరగడంతో పాటు నేలతల్లి ఆరోగ్యం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. భూసారాన్ని కాపాడుకునేందుకు పంట మార్పిడి పద్ధతులను పాటించాలని సాగునీటిని పొదుపుగా వాడుకుంటూ సుస్థిరమైన ఆదాయాన్ని పొందాలని కోరారు. అనంతరం ప్రొఫెసర్ కనకదుర్గ మాట్లాడుతూ అందుబాటులో ఉన్న మేలైన నాణ్యమైన విత్తన రకాలని రైతులు ఎంపిక చేసుకోవాలన్నారు. వరి, మొక్కజొన్న, వేరుశనగ పంటలలోని వివిధ రకాలు, వాటి కాలపరిమితి దిగుబడి వివరాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వి.శ్రీను నాయక్,వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్ ఏఈవోలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# రహదారులపై మక్కలు వరి ధాన్యం ఆరబోస్తే కఠిన చర్యలు ఎస్ఐ శ్రీనివాస్ యాదవ్



**మిడ్జిల్, మే15, ( నేటి దర్శిని ప్రతినిధి):** రహదారుల పైన మక్కలు వరి ధాన్యం ఆరబోసి వాహనదారుల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని మిడ్జిల్ ఎస్సై శ్రీనివాస్ యాదవ్ రైతులను హెచ్చరించారు. రహదారులపై ధాన్యం ఆరబోసి రాళ్లను అడ్డంగా పెట్టడం వలన నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు చావు అంచుల దాకా వెళ్లే పరిస్థితిలు ఏర్పడుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో రోడ్లపై ఉన్న దాన్యం వాహనదారులకు కనిపించక తీవ్ర ప్రమాదాలకు దారితీసె అవకాశం ఉందన్నారు. రైతులు రహదారుల పైన వేసిన రాళ్ల లేదా పంటల వల్ల ఎలాంటి ప్రమాదాలు జరిగిన పూర్తి బాధ్యత సంబంధిత రైతు దేనిని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని పోలీసులకు సహకరించాలని ఎస్సై శ్రీనివాస్ యాదవ్ కోరారు...

# పార్లమెంటరీ మహిళా సాధికారత కమిటీలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

- తెలంగాణకు దక్కిన అరుదైన గౌరవం



**ఉమ్మడి వరంగల్, మే 15(నేటి దర్శిని బ్యూరో):** దేశవ్యాప్తంగా మహిళల హక్కులు, సంక్షేమం, సాధికారతకు సంబంధించిన అంశాలపై కీలక సూచనలు చేసే పార్లమెంటరీ మహిళా సాధికారత స్థాయి కమిటీలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య సభ్యురాలిగా నియమితులయ్యారు. లోక్‌సభ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రతిష్ఠాత్మక కమిటీకి సీనియర్ పార్లమెంటేరియన్ పురందేశ్వరి అధ్యక్షత వహించనున్నారు. లోక్‌సభ, రాజ్యసభలకు చెందిన మహిళా ఎంపీలు కమిటీలో సభ్యులుగా కొనసాగనున్నారు. మహిళల భద్రత, విద్య, ఆర్థిక స్వావలంబన, ఉద్యోగావకాశాలు, లింగ సమానత్వం, సామాజిక రక్షణ తదితర అంశాలపై ఈ కమిటీ సమగ్రంగా అధ్యయనం చేసి కేంద్ర ప్రభుత్వానికి సూచనలు చేయనుంది. మహిళా సాధికారత కోసం అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రభావాన్ని సమీక్షించడంతో పాటు మహిళల ప్రాతినిధ్యం పెంపు, విధానాల సమర్థ అమలు, మహిళా హక్కుల పరిరక్షణకు అవసరమైన చర్యలపై కమిటీ ప్రత్యేక దృష్టి సారించనుంది. వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య కు ఈ కీలక కమిటీలో చోటు దక్కడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణం. మహిళా సమస్యలపై ఎంపీ డాక్టర్ కడియం కావ్య కి ఉన్న అవగాహన, సామాజిక అంశాలపై చూపుతున్న చొరవ దృష్ట్యా కమిటీలో ఎంపీ డా.కడియం కావ్య సేవలు కీలకంగా ఉండనున్నాయి. ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ మహిళల సాధికారత, భద్రత, ఆర్థిక పురోగతికి సంబంధించిన అంశాలను కమిటీలో బలంగా ప్రస్తావిస్తానన్నారు. మహిళల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం మరింత పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ, ముఖ్యంగా వరంగల్ ప్రాంత మహిళల సమస్యలు, అవసరాలను జాతీయ స్థాయిలో ప్రస్తావించే అవకాశం లభించడం ఆనందంగా ఉందన్నారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించే దిశగా తన వంతు కృషి కొనసాగుతుందని ఎంపీ డా.కడియం కావ్య స్పష్టం చేశారు.

# అంగన్వాడీలకు ఫోన్ల పంపిణీ

- సూపర్వైజర్ అరుణ జ్యోతి



**మిడ్జిల్, మే15 (నేటి దర్శిని ప్రతినిధి):** మెరుగైన సేవల కోసం అంగన్వాడీలకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ చేసినట్లు అంగన్వాడి సూపర్వైజర్ అరుణ జ్యోతి అన్నారు శుక్రవారం మండలంలోని మిడ్జిల్.మసి గుండ్లపల్లి. మల్లాపూర్. బోయిన్పల్లి. మర్లబాయి తండా. వేముల. ఇదులాబాయి తండా. గ్రామాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అంగన్వాడీలకు మెరుగైన సేవలు కోసం హూ ఇస్ ద గ్రామల సర్పంచులు కాంగ్రెస్ పార్టీ ఏజెంట్లు ఆధ్వర్యంలో స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేస్తున్నట్లు సూపర్వైజర్ అరుణ జ్యోతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు శంకర్. గోదా శ్రీశైలం. రాజు నాయక్. శశికళ. ధర్మ నాయక్. లతోపాటు. టీచర్లు రాణి. స్వరూప. అనిత. మంజుల. మాధవి. నర్మద. తదితర గ్రామాల ఏజెంట్లు పాల్గొన్నారు

# రామదేవ్ రావును మర్యాదపూర్వకంగా కలిసిన 'రెడీ టు సర్వ్' ఫౌండేషన్ అధ్యక్షుడు పెద్ది శంకర్

- ఈ నెల 24న ఎక్స్‌పీరియమ్ పార్క్‌లో ఘనంగా 'తాటి మ్యూజిక్ మేళా'



**హైదరాబాద్, మే15 (నేటి దర్శిని):** తెలంగాణ సంస్కృతికి, గ్రామీణ జీవనానికి ప్రతీకైన తాటి, ఈత వృత్తులను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ నెల 24వ తేదీన నగరంలోని ఎక్స్‌పీరియమ్ పార్క్‌లో 'తాటి మ్యూజిక్ మేళాను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న మరియు వాసుదేవ రెడ్డి తదితరులు పాల్గొని ఈ మేళాకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు.. గీత వృత్తికి పూర్వవైభవం తీసుకురావడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. రాష్ట్రవ్యాప్తంగా తాటి, ఈత మొక్కలను పెద్ద ఎత్తున నాటి, వాటిని సంరక్షించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుంది. ప్రకృతి సిద్ధమైన పానీయాల ప్రాధాన్యతను ప్రజలకు చాటిచెప్పడమే ఈ మ్యూజిక్ మేళా ప్రధాన ఉద్దేశం. రామదేవ్ రావుతో పెద్ది శంకర్ భేటీ ఈ కార్యక్రమ ఏర్పాట్లలో భాగంగా 'రెడీ టు సర్వ్' ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పెద్ది శంకర్ ఎక్స్‌పీరియమ్ పార్క్ వ్యవస్థాపకులు రామదేవ్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. గౌరవపూర్వక ఆహ్వానం: ఈ నెల 24న జరగబోయే మ్యూజిక్ మేళాకు రావాల్సిందిగా రామదేవ్ రావు పెద్ది శంకర్ ను ఆహ్వానించారు. ప్రశంసలు: సమాజ హితం కోసం, ముఖ్యంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం కోసం రామదేవ్ రావు చేస్తున్న కృషిని పెద్ది శంకర్ కొనియాడారు. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా ఇలాంటి వినూత్న కార్యక్రమాన్ని చేపట్టడం స్ఫూర్తిదాయకమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతిని, గీత కార్మికుల శ్రమను గౌరవించే ఈ మ్యూజిక్ మేళాలో ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# రోగులకు అండగా మిడ్జిల్ మండల పాత్రికేయ సంఘం

- టీఎన్జీవో తాలూకా అధ్యక్షుడు తిరుపతయ్య ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ కార్యక్రమం





టీఎన్జీవో తాలూకా అధ్యక్షుడు తిరుపతయ్య

**మిడ్జిల్, మే15(నేటి దర్శిని ప్రతినిధి):** మిడ్జిల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం మానవతా దృక్పథంతో పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీఎన్జీవో తాలూకా అధ్యక్షుడు తిరుపతయ్య ఆధ్వర్యంలో మిడ్జిల్ మండల పాత్రికేయ సంఘం నాయకులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేసి పరామర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రోగులకు ధైర్యం చెప్పడం, వారికి అవసరమైన సహాయం అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. సమాజ సేవలో పాత్రికేయులు ఎప్పుడూ ముందుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మీర్జా, రాఘవేందర్ రెడ్డి, రాజేష్ కుమార్, మహేష్ కుమార్, ఎం.శ్రీనివాసులు, పరంజ్యోతి, బాల్ నారాయణ, నరసింహ, నిరంజన్, వరుణ్ రాజ్, మల్లేష్, సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్య పరిష్కారానికి కృషిచేసిన డివిజన్ అధ్యక్షులు: పున్న గణేష్ నేత

**మహేశ్వరం, మే15 (నేటి దర్శిని):** మహేశ్వరం నియోజకవర్గం శ్రీ రామకృష్ణ పురం డివిజన్ లో వాసవి కాలనీ రోడ్ నెంబర్ 1/ఏ లో గత పదిహేను సంవత్సరాల నుండి నిరుపయోగంగా ఉన్న మోడల్ లైటింగ్ ను సుధాకర్ శర్మ స్థానిక ఎమ్మెల్యే దృష్టికి మరియు కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లిన పరిష్కరించబడని కారణంగా వారం రోజుల క్రితం సుధాకర్ శర్మ నా దృష్టికి తీసుకువచ్చిన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి ఈరోజు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి నిరుపయోగముగా ఉన్న మోడల్ లైటింగ్ ను ఎంఎంసీ అధికారుల సహకారంతో క్షేత్రస్థాయిలో ఉండి శ్రీ రామకృష్ణ పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్ నేత. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ శాసనసభ్యులు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డికి మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టిపిసి సి సభ్యులు శ్రీ దేప భాస్కర్ రెడ్డి సహకారంతో శ్రీ రామకృష్ణాపురం డివిజన్లో ఉన్న కాలనీలలో సమస్యలు లేని డివిజన్ గా అభివృద్ధి చేయడమే ప్రథమ కర్తవ్యం గా భావించి ముందుకెళ్తామని ఈ సందర్భంగా కాలనీల సంక్షేమ సంఘం సభ్యులందరికీ తెలియజేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో వాసవి కాలనీ రోడ్ నెంబర్ 1/A వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జెల్లా జగన్నాథం కార్యదర్శి మల్లేష్ యాదవ్, ఉపాధ్యక్షులు లింగారెడ్డి కోశాధికారి శ్రీధర్ రెడ్డి, సుధాకర్ శర్మ,,భాస్కర్, సుధాకర్ గుప్తా, నాగరాజు పురుషోత్తం గుప్త, సూర్యనారాయణ గుప్త, జంగారెడ్డి, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.



# సంపాదకీయం

## ట్రంప్ కుంపటితో ఆర్థిక రంగం కుదేలు !



ఇరాన్‌పై దాడితో ప్రపంచ దేశాలను ప్రమాదంలో పడేసిన ట్రంప్ ఇంకా మేల్కొనలేదు. తనవల్ల ప్రపంచం అతలాకుతలం అయ్యిందే అన్న కించిత్ చింతన కూడా కానరావడం లేదు. పైపెచ్చు..ఇరాన్‌ను భూమండలం మీద లేకుండా చేస్తామని కూడా ప్రకటించారు. ఇరాన్ సంగతి ఎలా ఉన్నా...భారత్ లాంటి దేశాలు చమరు ధరలతో విలవిల్లాడుతున్నాయి. ఆర్థిక సంక్షోభం తప్పేట్లుగా లేదు. చమురు రవాణా ఆగిపోవడంతో పాటు, ముడి చమురు ధరలు పెరగడంతో నానాయాతన పడాల్సి వస్తోంది. తాజాగా భారత్‌లో పెట్రీ, డీజిల్ దలరు పెరిగాయి. ఈ పెరుగుదల ఒక్క ఇంధనంపైనే ఉండదు. ఇకనుంచి అన్నిరంగాల పై దీని ప్రభావం పడుతుంది. నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతాయి. విమానయాన రంగం ఇప్పటికే గగనకుసుమమైంది. ఇది మరింత ప్రమాదంలో పడనుంది. వెరసి సామాన్యుల బతుకులు భారం కానున్నాయి. పొదుపు మంత్రం ప్రకటించిన ప్రధాని మోడీ కాన్వాయ్‌లను తగ్గించారే తప్ప, అసలు పొందుపు విషయంలో మాట్లాడడం లేదు. దేశంలో ప్రజాప్రతినిధుల దుబారాను తగ్గించే ప్రయత్నాలపై ఎవ్వరు కూడా మాట్లాడడం లేదు. దీనికితో తోడు ఈ సంక్షోభం దృష్ట్యా ఐటి కంపెనీల్లో ఉద్యోగాల కోతలు మొదలయ్యాయి. రిక్రూట్‌మెంట్లు తగ్గాయి. ప్రధాని మోడీ ఇచ్చిన వర్క్‌ఫ్రమ్ హోమ్ విధానం అమలు సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. కరోనా సమయంలో విధిలేక ఆఫీసులు మూసుకున్న ఐటి కంపెనీలు ఇప్పుడు ఉద్యోగులను వర్క్‌ఫ్రమ్ హోమ్‌కు పరిమితం చేయదల్చుకోలేదు. దేశంలో పెరుగుతున్న ఇంధన వినియోగాన్ని తగ్గించి, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక కీలక ప్రతిపాదనను ముందుకు తీసుకువచ్చారు. ఉద్యోగులు వీలైనంత వరకు ఇంటి నుండే పని చేసే విధానాన్ని పాటించాలని ఆయన సూచించారు. ఈ నేపథ్యంలో, దేశీయ ఐటీ హబ్‌లలో ఒకటైన హైదరాబాద్‌పై ఈ నిర్ణయం ఎలాంటి ప్రభావం చూపుతుందనే అంశంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం సుమారు 9 లక్షల మంది ఐటీ ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో మెజారిటీ ఉద్యోగులు తమ కార్యాలయాలకు చేరుకోవడానికి ప్రతిరోజూ సగటున 50 కిలోమీటర్ల మేర ప్రయాణిస్తున్నారు. ఈ సుదీర్ఘ ప్రయాణం వల్ల అటు ట్రాఫిక్ సమస్యలు పెరగడమే కాకుండా, భారీగా ఇంధనం ఖర్చవుతోంది. ప్రధాని సూచన మేరకు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని అమలు చేస్తే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. హైదరాబాద్ ఐటీ రంగంలో ఈ విధానం వల్ల కలిగే ఆర్థిక ప్రయోజనాలపై ప్రాథమిక అంచనాలు వెలువడ్డాయి. నగరంలోని మొత్తం ఐటీ ఉద్యోగులలో కనీసం సగం మంది, అంటే సుమారు 4.5 లక్షల మంది వారానికి కేవలం మూడు రోజులు ఇంటి నుండి పని చేసినా అద్భుతమైన ఫలితాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల నెలకు దాదాపు 140 కోట్ల రూపాయల విలువైన ఇంధనం ఆదా అయ్యే అవకాశం ఉందని అంచనా. ఇది దేశీయ ఆర్థిక వ్యవస్థకు పెద్ద ఊరటనిస్తుందని భావిస్తున్నారు. ఇలా ఒక్కో నగరాన్ని తీసుకుంటే గణనీయమైన మార్పులు ఉంటాయని అంటున్నారు. కోవిడ్ సమయంలో వర్క్ ఫ్రమ్ హోమ్ విధానం విజయవంతంగా అమలు జరిగినప్పటికీ, ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఐటీ కంపెనీలు ఈ విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి. పెద్ద కంపెనీలు ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి చూస్తుండగా, కొన్ని చిన్న స్థాయి సంస్థలు మాత్రం ఈ విధానం వల్ల తమ ఉత్పాదకత దెబ్బతింటుందని లేదా ఇతర నష్టాలు వస్తాయని ఆందోళన చెందుతున్నాయి. ప్రభుత్వం నుండి స్పష్టమైన మార్గదర్శకాలు వస్తే తప్ప ఈ విషయంలో క్లారిటీ వచ్చేలా లేదు. కేవలం వర్క్ ఫ్రమ్ హోమ్ మాత్రమే కాకుండా, పెట్రోల్ , డీజిల్ వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడం కూడా అత్యవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ఇంటి నుండే పని చేయడం వల్ల ఇంధన దిగుమతులు తగ్గి, అంతర్జాతీయ మార్కెట్‌లో భారత రూపాయి విలువ పెరగడానికి తోడ్పడుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు దేశ ఆర్థిక భవిష్యత్తుకు ఈ 'వర్క్ ఫ్రమ్ హోమ్' విధానంఒక కీలక మలుపు కానుంది. ఇకపోతే ఆర్థిక సంక్షోభం కారణంగా అనేక ఐటి కంపెనీలు కుదింపు మోజులో పడ్డాయి. ఎడాపెడా ఉద్యోగులను తొలగిస్తున్నాయి. గత నెలలో ప్రపంచవ్యాప్తంగా 30,000 మంది ఉద్యోగులను తొలగించిన అంతర్జాతీయ టెక్నాలజీ కంపెనీ ఒరాకిల్.. తాజాగా మరో షాకిచ్చింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) వంటి పలు ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్ పక్రియ ద్వారా విద్యార్థులకు జారీ చేసిన జాబ్ ఆఫర్ లెటర్లను, ప్రీ-ప్లేసమెంట్ ఆఫర్ల (పీపీఓ)ను కంపెనీ రద్దు చేసింది. ఒరాకిల్ తాజా నిర్ణయంతో ప్రభావితమైన కాలేజీల్లో ఎన్ఐటీ వరంగల్, వీఎన్ఐటీ నాగ్‌పూర్, ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ రూర్కీ, ఐఐటీ బీహెచ్‌యూ కూడా ఉన్నాయి. ఆఫర్ లెటర్ల రద్దు విషయాన్ని కంపెనీ ఈ వారంలోనే విద్యార్థులకు వెల్లడించింది. దాంతో వారు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఎందుకంటే, చాలావరకు ఇంజనీరింగ్ కాలేజీలు ప్రాంగణ నియామకాల విషయంలో ఒక విద్యార్థి- ఒక ఉద్యోగం విధానాన్ని అనుసరిస్తున్నాయి. అంటే, క్యాంపస్ రిక్రూట్‌మెంట్ పక్రియలో ఒక కంపెనీ నుంచి జాబ్ ఆఫర్ అందుకున్న విద్యార్థికి ఇతర కంపెనీల ఆఫర్లను దక్కించుకునే అవకాశం ఉండదు. దాంతో ఒరాకిల్ ఆఫర్ కోల్పోయిన వారిప్పుడు కొత్త ఉద్యోగం కోసం అన్వేషించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అమెరికన్ టెక్నాలజీ దిగ్గజాల్లో ఒకటైన సిస్కో కూడా భారీగా ఉద్యోగాల కోతకు సిద్ధమైంది. వ్యాపార పునర్వ్యవస్థీకరణలో భాగంగా సిబ్బంది సంఖ్యను దాదాపు 4,000 మేర తగ్గించుకునే ఆలోచనలో ఉన్నట్లు సంస్థ ప్రకటించింది. ఈ విషయాన్ని ప్రభావిత సిబ్బందికి నేరుగా తెలియజేయడం జరుగుతుందని కంపెనీ పేర్కొంది. సిస్కో కూడా తన పెట్టుబడులను కృత్రిమ మేధ (ఏఐ)తో పాటు వేగంగా వృద్ధి చెందుతున్న ఇతర విభాగాల వైపు పెట్టుబడులను మళ్లించే ప్రయత్నాల్లో ఉంది. మైక్రోసాఫ్ట్‌పరమైన వృత్తి నిపుణుల సోషల్ నెట్‌వర్కింగ్ ఎలాట్‌ఫామ్ లింక్డ్ఇన్ సైతం ఉద్యోగులను తగ్గించుకునే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలిసింది. వృద్ధి చెందుతున్న విభాగాలపై దృష్టిపెట్టేందుకు సిబ్బంది పునర్వ్యవస్థీకరించాలను కుంటున్న కంపెనీ.. అందులో భాగంగా 5 శాతం ఉద్యోగాలకు కోత పెట్టాలనుకుంటోందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. లింక్డ్ఇన్‌లో ప్రపంచవ్యాప్తంగా 17,500 ఉద్యోగులు పనిచేస్తున్నారు. మొత్తంగా ట్రంప్ పెట్టిన కుంపటి ఇప్పట్లో చల్లారేలా లేదు. ప్రపంచ ఆర్థిక స్థితిని ఎంతగా దిగజారుస్తుందో ఇప్పుడే చెప్పలేం. భారత్ ఆర్థిక వ్యవస్థపై మాత్రం తీవ్ర ప్రభావం పడడం ఖాయమని చెప్పవచ్చు.

# ఎస్సీ, బీసీ, మైనారిటీల ఓట్లు తొలగించేందుకే కర్ణాటకలో 'సర్'..

### డీకే శివకుమార్ ఆరోపణ

న్యూఢిల్లీ మే 15 (నేటి దర్శిని)

కర్ణాటకలో ఎస్సీ, బీసీ, మైనారిటీల ఓట్లు తొలగించేందుకే కేంద్ర ఎన్నికల సంఘం 'సర్' ప్రక్రియ చేపట్టబోతుందని కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఆరోపించారు. 16 రాష్ట్రాల్లో చేపట్టనున్న మూడో దశ 'సర్'లో భాగంగా కర్ణాటకలో కూడా 'సర్' ప్రక్రియ చేపట్టేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. ఈ నెల 30 నుంచి ఇక్కడ సర్ ప్రారంభమవుతుంది. ఈ నేపథ్యంలో కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్పదించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఈసీపై, కేంద్రంపై విమర్శలు చేశారు. "కేంద్ర ఎన్నికల సంఘం 'సర్' ప్రక్రియ చేపట్టేందుకు సిద్ధమవుతోంది.




ఈ విషయంలో అన్ని పార్టీల లీడర్లని చైతన్యం చేస్తున్నాం. పార్టీలతో సంబంధం లేకుండా బీజేపీ, జేడీఎస్ కూడా తమ ఓట్లను కాపాడుకోవాలి. ఎస్సీ, బీసీ, మైనారిటీల ఓట్లను తొలగించేందుకే 'సర్' నిర్వహిస్తున్నారు. కానీ, మేం వారి ఓట్లను రక్షిస్తాం. దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కలిగి ఉండాలి. కర్ణాటకలో 88 శాతం నుంచి 90 శాతం వరకు ఓటర్లుగా గుర్తింపు కలిగి ఉన్నారు. మేం వారందరినీ చైతన్యం చేసేందుకు ప్రయత్నిస్తాం" అని డీకే శివకుమార్ వ్యాఖ్యానించారు. ఈ నెల 30 నుంచి కర్ణాటకతోపాటు తెలంగాణ, పంజాబ్, ఝార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో కూడా సర్ మొదలవుతుంది. కర్ణాటకలో ఓటర్ల తుది జాబితా వచ్చే అక్టోబర్ 7న ప్రకటిస్తారు. అయితే, ఈ ప్రక్రియను కర్ణాటకలో అధికార కాంగ్రెస్ పార్టీతోపాటు ఇతర పార్టీలు కూడా వ్యతిరేకిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం సిద్ధరామయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడుకోవడానికి ప్రయత్నిస్తామన్నారు. ఇందుకోసం సమర్థవంతంగా పని చేయాలని అధికారులకు సూచించారు.

# హోర్ముజ్ వద్ద చిక్కుకుపోయిన 360 నౌకలు..

- పెరిగిపోతున్న ట్రాఫిక్..
-రోజుకు 40 నౌకలే రవాణా

న్యూఢిల్లీ మే 15 (నేటి దర్శిని)

హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఇక్కడ చిక్కుకుపోయిన నౌకల్ని ఇరాన్ అంత సులభంగా అనుమతించడం లేదు. దీంతో హోర్ముజ్ వద్ద ప్రస్తుతం 360 వరకు వాణిజ్య నౌకలు చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది. వివిధ దేశాలకు చమురు, ఆహారం, ఇతర ఉత్పత్తులు రవాణా చేసే నౌకలివి. దీంతో ఆయా దేశాలు సమస్యలు ఎదుర్కొంటున్నాయి. 360 వరకు నౌకలు చిక్కుకుపోవడంతో ఈ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ పెరిగిపోయింది. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో రోజుకు 40 నౌకలు మాత్రమే ఇక్కడినుంచి కదులుతున్నాయి.



దీంతో నౌకా రవాణాకు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ప్రపంచంలోనే అత్యంత రద్దీ అయిన సముద్ర రవాణా మార్గం ఇది. అంతర్జాతీయ ఆర్థిక ప్రగతికి కూడా ఈ మార్గం కీలకం. దాదాపు 20 శాతం నౌకలు ఈ మార్గం నుంచే వెళ్తాయి. అందులోనూ చమురు, గ్యాస్ నౌకలు ఎక్కువగా రవాణా జరిగేది ఈ ప్రాంతం నుంచే. అలాంటిది, ఇక్కడ నౌకలు నిలిచిపోవడంతో అంతర్జాతీయంగా చమరు సంక్షోభం మొదలైంది. చమురు మార్కెట్లు, ప్రభుత్వాలు, షిప్పింగ్ కంపెనీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. షిప్పింగ్ ఇంటెలిజెన్స్ సంస్థ కెప్లర్ ప్రకారం.. ఇక్కడ 360 వాణిజ్య, ఆహారోత్పత్తుల నౌకలు నిలిచిపోయాయి. వీటిలో అతికష్టం మీద రోజుకు 40 నౌకలు మాత్రం కదులుతున్నాయి. ఇక్కడ చిక్కుకుపోయిన నౌకల్ని రక్షించేందుకు అమెరికాకు చెందిన నౌకలు రక్షణ కల్పిస్తున్నాయి. అయినప్పటికీ, నౌకల రవాణా చాలా తక్కువగా ఉంది. ఇలాంటి యుద్ధం, దిగ్బంధం వంటి పరిస్థితుల్లో రక్షణ, సహాయం అందించడానికి ఈ ప్రాంతం అంత అనుకూలం కాదు. వన్ వే ట్రాఫిక్ సాధ్యం కాదు. అందుకే అనేక నౌకల్ని రక్షించడం కష్టంగా మారింది. దీంతో ప్రపంచం ఎప్పుడూ చూడని నౌకల బ్లాకేజ్ కొనసాగుతోంది.

# అదానీ విడుదల కోసమే ప్రధాని అమెరికాతో వాణిజ్య ఒప్పందం

న్యూఢిల్లీ మే 15 (నేటి దర్శిని)

బిలీయనీర్ వ్యాపారవేత్త అదానీ విడుదల కోసం బేరం కుదుర్చుకునేందుకే ప్రధాని మోడీ అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై సంతకం చేశారని లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శుక్రవారం విమర్శించారు. అదానీ లంచాన్ని దాచిపెట్టారని ఆరోపిస్తూ దాఖలైన వ్యాజ్యాన్ని పరిష్కరించుకోవడానికి అమెరికా అంగీకరించిందన్న వార్తలు వెలువడిన అనంతరం రాజీపడిన ప్రధాని మోడీ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోలేదు.. కానీ అదానీ కోసం బేరసారాలు సాగించారు అని రాహుల్ ఎక్స్ లో విమర్శించారు. భారతదేశంలోని తన కంపెనీ భారీ సౌరప్రాజెక్టును లంచం ఇచ్చి దక్కించుకునేందుకు పెట్టుబడి దారులను మోసం చేశారనే ఆరోపణలపై అదానీకి వ్యతిరేకంగా దాఖలైన వ్యాజ్యాన్ని పరిష్కరించుకునేందుకు అమెరికా ప్రభుత్వం అంగీకరించిందని గురువారం ప్రచురించిన కోర్టు పత్రాల ప్రకారం తెలిసింది. ఈ నివేదికపై కాంగ్రెస్




కమ్యూనికేషన్ ప్రతినిధి జైరాం రమేష్ స్పందించారు. అమెరికా చేసిన దోపిడీకి, పూర్తిగా ఏకపక్ష భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందానికి ప్రదాని ఎందుకు అంగీకరించారో ఇప్పుడు స్పష్టమైందని అన్నారు. జాతీయ ప్రయోజనాల కోసం కాకుండా, అధ్యక్షుడు ట్రంప్ బెదిరింపుల మేరకు ప్రధాని 2025 మే 10న ఆపరేషన్ సింధూర్ ను ఎందుకు ఆకస్మికంగా నిలిపివేశారో కూడా స్పష్టమౌతుంది. మోదానిపై ఉన్న అవినీతి ఆరోపణలన్నింటికీ ట్రంప్ ప్రభుత్వం ఉపసంహరించుకోబోతుందని సమాచారం అని ఎక్స్ లో పేర్కొన్నారు. ప్రధాని ఇంకెంతగా రాజీపడతారని ప్రశ్నించారు. 2024 చివరలో దాఖలు చేసిన వ్యాజ్యంలో, అదానీ గ్రూప్ ఛైర్మన్ అదానీ, అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ లో డైరెక్టర్ గా ఉన్న అతని మేనల్లుడు సాగర్ అదానీ, 2020-2024 మధ్య కాలంలో, 20 ఏళ్లలో 2 బిలియన్ డాలర్ల లాభాన్ని ఆర్జించే అవకాశం ఉన్న నిబంధనలతో లాభదాయకమైన సౌర విద్యుత్ సరఫరా కాంట్రాక్టులను పొందేందుకు భారత ప్రభుత్వ అధికారులకు సుమారు 265 మిలియన్ డాలర్లు లంచాలు చెల్లించేందుకు అంగీకరించారని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ ఆరోపించింది. లంచాన్ని కప్పిపుచ్చి తప్పుడు, తప్పుదారి పట్టించే ప్రకటనల ఆధారంగా, అదానీ గ్రూప్ అమెరికా సంస్థలతో సహా పలు సంస్థల నుండి 2 బిలియన్ డాలర్ల రుణాలు, బాండ్లను సమీకరించిందని వ్యాజ్యంలో పేర్కొంది.

# అది దేవాలయమే.. పూజలు చేసుకోవచ్చు..

### -ధర్ భోజ్‌శాలపై మధ్యప్రదేశ్ హైకోర్టు సంచలన తీర్పు

న్యూఢిల్లీ మే 15 (నేటి దర్శిని)

వివాదాస్పద భోజ్‌శాల విషయంలో మధ్యప్రదేశ్ హైకోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. ఈ భోజ్‌శాలను దేవాలయంగా ప్రకటించింది. అంతేకాదు, హిందువులు ఇక్కడ పూజలు నిర్వహించుకోవచ్చని కూడా వెల్లడించింది. మధ్యప్రదేశ్‌లోని ధర్ జిల్లాలో ఉన్న భోజ్‌శాల--కమల్ మౌలా కాంప్లెక్స్ విషయంలో వివాదం నడుస్తోంది. ఇది దేవాలయం అని హిందూ సంఘాలు అంటుండగా, ఇది తమకే చెందినదని ముస్లిం సంఘాలు చెప్పాయి.దీంతో ఈ అంశం దశాబ్దాలుగా వివాదంగా మారింది. 2003లో ఈ ప్రదేశం హిందూ, ముస్లింలకు చెందినదని ఏఎస్ఐ (ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా) చెప్పింది. చాలా కాలంగా ఇక్కడ హిందువులు మంగళవారం పూజలు చేస్తుంటారు. ముస్లింలు శుక్రవారం మధ్యాహ్నం నమాజ్ చేస్తుంటారు. మతపరంగా వీటికి మాత్రమే ఇక్కడ అనుమతి ఉంది. తర్వాత హిందూ సంఘాలు ఈ



నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కోర్టును ఆశ్రయించాయి. ఇక్కడ నిరంతరం పూజలు చేసుకునే హక్కు కల్పించాలని కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. దీన్ని ముస్లిం సంఘాలు వ్యతిరేకించాయి. దీంతో ఈ భోజ్‌శాల కాంప్లెక్స్ సంగతి తేల్చాల్సిందిగా ఏఎస్ఐని కోర్టు ఆదేశించింది. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఏఎస్ఐ అధికారులు విచారణ జరిపి నివేదిక అందించారు. ఈ నివేదిక ఆధారంగా ఇది దేవాలయమే అని మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పు వెల్లడించింది. ఇక్కడ హిందువులు పూజలు చేసుకోవచ్చని అనుమతించింది. ఏఎస్ఐ అందించిన శాస్త్రీయ, చారిత్రక ఆధారాలను అనుసరించి ఈ తీర్పు ఇస్తున్నట్లు కోర్టు తెలిపింది. అన్ని వర్గాలకు చెందిన రాజ్యాంగపరమైన అంశాల్ని, హక్కుల్ని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు కోర్టు తెలిపింది. ఏఎస్ఐ ఒక చట్టబద్ధమైన, శాస్త్రీయ సంస్థ అని, ఆ సంస్థ వివరాల్ని పరిగణనలోకి తీసుకున్నట్లు చెప్పింది. పరమార రాజు భోజ్ హయాంలో ఈ ప్రదేశం సంస్కృత విద్యా కేంద్రంగా, సరస్వతి దేవాలయంగా విలసిల్లినట్లు కోర్టు గుర్తించింది. అలాగే, ఈ ప్రదేశాన్ని చారిత్రక ప్రదేశంగా రక్షించాలని కూడా కేంద్ర ఆర్కియాలజీ శాఖకు సూచించింది. ఇక, ఈ కేసు విచారణకు సహకరించిన అన్ని పక్షాల లాయర్లకు కోర్టు కృతజ్ఞతలు తెలిపింది. అయితే, కోర్టు తీర్పుపై ముస్లిం సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఈ తీర్పును పరిశీలించిన తర్వాత, దీన్ని సుప్రీంకోర్టులో సవాలు చేస్తామని తెలిపాయి. మరోవైపు కోర్టు తీర్పు నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భోజ్‌శాల ప్రాంతంలో భారీగా భద్రతా బలగాల్ని మోహరించారు. 1,200 మంది వరకు పోలీసులు, కేంద్ర బలగాలు

## గ్రామ పంచాయితీ ట్రిబ్యునల్ చైర్మన్ ని కలిసిన మాజీ వైస్ ఎంపీపీ..



**ఆమనగల్లు,మే15(నేటి దర్శిని):** గ్రామపంచాయతీ ట్రిబ్యునల్ చైర్మన్ సూదిని రామ్ రెడ్డిని శుక్రవారం హైదరాబాదులోని ఆయన నివాసంలో ఆమనగల్లు మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించడం జరిగింది. పంచాయితీ రాజ్ సంస్థలకు సంబంధించిన వివాదాలను, న్యాయపరమైన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని చైర్మన్ సూదిని రామ్ రెడ్డిని జక్కు అనంతరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో నిట్ట నారాయణ, మేడిగడ్డ తాండ ఉప సర్పంచ్ విజయ్ రాథోడ్, నాయకులు జగన్ గౌడ్, రమేష్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి వస్పుల జంగయ్య పరామర్శ,ఆర్థిక సహాయం అందజేత....



**ఆమనగలు, మే1(నేటి దర్శిని);** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు కు చెందిన వి.జంగయ్య (నల్లాల జంగయ్య మున్సిపాలిటీ వర్కర్) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న హైదరాబాద్ టెలికం బోర్డు సభ్యుడు వస్పుల జంగయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులను అర్పించారు. ఆయన మృతి పట్ల ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు రూ:5000/నగదు ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు కాసోజు రాము,డొక్కా పురుషోత్తం,జంతుక రాములు, రామచంద్రయ్య, పులికంటి మహేష్,ఒగ్గు జంగయ్య,తదితరులు ఉన్నారు.

## మిడ్జిల్ తహసీల్దారును సన్మానించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుక్కునూరు విజయ భాస్కర్ రెడ్డి




**మిడ్జిల్, మే 15, (నేటి దర్శిని ప్రతినిధి):** మిడ్జిల్ మండల తహసీల్దార్ బాధ్యతలు స్వీకరించిన గంగాపురం రాఘవేందర్ రెడ్డి ని శుక్రవారం రోజు కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుక్కునూరు విజయ భాస్కర్ రెడ్డి వారి కలిసి శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని వారు కోరారు.

## మహబూబ్ నగర్ లోని ఎస్బిఐ డిఎం ని కలిసిన డాక్టర్.బంగ్లా లక్ష్మికాంత్ రెడ్డి



**మిడ్జిల్, మే 15, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో ):** అమరచింత పట్టణంలో ఎస్బిఐ బ్యాంకు వీలైనంత త్వరలో ఎస్బిఐ బ్యాంకు ఏర్పాటు చేయాలనీ, మహబూబ్ నగర్ లోని జోగులాంబ రీజినల్ కార్యాయంలోని డీ.ఎం ని కలిసి, కొద్ది రోజులక్రితం హైదరాబాద్ లోని తెలంగాణ ఎస్బిఐ డీజీఎంని కలిసి వినతి పత్రం ఇచ్చిన విషయాన్ని డా.బంగ్లా లక్ష్మికాంత్ రెడ్డి డీ.ఎం దృష్టికి తీసుకొచ్చారు. డీ.ఎం స్పందిస్తూ కొద్ది రోజులక్రితం అమరచింతలో సర్వే చేశామని, ఇట్టి రిపోర్ట్ ని హైదరాబాద్ లోని హెడ్ ఆఫీస్ కి పంపించామని, రిపోర్ట్ ఆధారంగా వీలైనంత త్వరలో మీకు శుభ వార్త చెప్తామని డీ.ఎం తెలియజేశారు.

# జడ్చర్ల మున్సిపాలిటీ అవినీతి ఫిర్యాదుల మేరకు తనిఖీ: ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ

- కమిషనర్, మాజీ చైర్మన్ కౌన్సిలర్ రాజు పై తీవ్ర ఆరోపణలు

**మిడ్జిల్ ,మే15 (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో ):** జడ్చర్ల మున్సిపాలిటీ అవినీతి ఫిర్యాదుల మేరకు తనిఖీ నిర్వహించామని ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ తెలిపారు జడ్చర్ల మున్సిపాలిటీలో ఏసీబీ దాడులు.. అవినీతి గూటి కదిలిందా?"లంచం లేక పని కాదు" అన్న ఆరోపణల మధ్య ఆకస్మిక తనిఖీలుజడ్చర్ల మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఏసీబీ అధికారుల ఆకస్మిక తనిఖీలు తీవ్ర కలకలం రేపాయి. గత కొంతకాలంగా మున్సిపాలిటీలో అవినీతి, అక్రమాలు, అనుమతుల పేరుతో భారీగా ముడుపులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఏసీబీ రంగంలోకి దిగింది. మాజీ కౌన్సిలర్ కుమ్మరి రాజు 10 వార్డ్ ఇష్టారాజ్యంగా లంచం వసూలు చేసినట్లు ఫిర్యాదులు చేశారు కుమ్మరి రాజు అనే మాజీ కౌన్సిలర్ మున్సిపల్ పట్టణంలో 27 వార్డుల్లో ఇస్తారాజ్యముగా వసూలు చేసినట్లు ఫిర్యాదులు తెలిపారు ప్రతి సీసీ రోడ్ల గాని మురికి కాలువల గాని పరిమిషన్ వచ్చిందంటే చాలు వసూలు జేబులు ఉండాలని లేకుంటే పర్మిషన్ లేదు అని కౌన్సిలర్ తో పాటు మున్సిపల్ చైర్మన్ భర్త నరసింహులు వ్యవహరించినట్లు ఫిర్యాదులు తెలిపారు.మున్సిపల్ కార్యాలయం అంటే ప్రజలకు సేవలు అందించే కేంద్రంగా ఉండాలి గానీ... "లంచాల దుకాణం"గా మారిందనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఇంటి నిర్మాణ




అనుమతులు కావాలన్నా, బిల్లులు క్లియర్ చేయించాలన్నా, ఫైళ్లు కదలాలన్నా "చెల్లించాల్సిందే" అన్న పరిస్థితి నెలకొన్నట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కమిషనర్, మాజీ చైర్మన్‌పై తీవ్ర ఆరోపణలు మున్సిపల్ బిల్లులను ఇష్టారాజ్యంగా డ్రా చేశారనే ఆరోపణలు కమిషనర్‌తో పాటు గత మున్సిపల్ చైర్మన్‌పై కూడా వినిపిస్తున్నాయి. కోట్ల రూపాయల పనులు, కాంట్రాక్టర్ల బిల్లులు, నిర్మాణ అనుమతుల వ్యవహారాల్లో భారీ అక్రమాలు జరిగాయనే ఫిర్యాదులు ఏసీబీ దృష్టికి వెళ్లినట్లు సమాచారం.ఈ నేపథ్యంలో ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ ఆధ్వర్యంలో అధికారులు కార్యాలయంలోని పలు విభాగాల రికార్డులను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు. ముఖ్యంగా నిర్మాణ అనుమతుల ఫైళ్లు, బిల్లుల చెల్లింపుల పత్రాలు, పన్నుల విభాగానికి సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్లు తెలిసింది.కాంట్రాక్టర్ వద్ద రూ.50 వేల నగదు స్వాధీనం తనిఖీల సమయంలో ఓ కాంట్రాక్టర్ వద్ద నుంచి రూ.50 వేల నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది ఎవరికి ఇవ్వాల్సి ఉంది మున్సిపల్ కార్యాలయానికి ఎందుకు తీసుకొచ్చారు అనే కోణాల్లో అధికారులు ఆరా తీస్తున్నారు.ఈ ఘటనతో మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పలువురు ఉద్యోగులను అధికారులు విడివిడిగా ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. పర్మిషన్ కావాలంటే పర్సు తెరవాలి"జడ్చర్లలో నిర్మాణ అనుమతుల వ్యవహారం పూర్తిగా అవినీతి మయమైందని బాధితులు ఆరోపిస్తున్నారు. "లంచం ఇవ్వకుంటే ఫైల్ కదలదు... అనుమతి రావాలంటే మధ్యవర్తులు తప్పనిసరి" అన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. కొందరు ఇప్పటికే భారీ ముడుపులు చెల్లించి అనుమతులు పొందగా... ఇప్పుడు ఏసీబీ దాడులతో వారిలోనూ గుబులు మొదలైనట్లు సమాచారం. అవినీతి బట్టబయలవుతుందా ఏసీబీ తనిఖీలు సాధారణ పరిశీలనకే పరిమితమవుతాయా లేక జడ్చర్ల మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతి సామ్రాజ్యాన్ని పూర్తిగా బయటపెడతాయా అన్నది ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. ప్రజలు మాత్రం ఈ దాడులతో నిజాలు వెలుగులోకి రావాలని, అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు

# సమాచారం దాచొద్దు.. చట్టాన్ని మరువొద్దు

- ఎంజీయూలో ఆర్‌టీఐ అవగాహన సదస్సు
- ఆర్‌టీఐ అమలులో పారదర్శకత అవసరం: డాక్టర్ యర్రమాద కృష్ణారెడ్డి



**నల్గొండ, మే 15 (నేటి దర్శిని):** సమాచార హక్కు చట్టం-2005 (ఆర్‌టీఐ) అమలులో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రముఖ న్యాయ నిపుణులు డాక్టర్ యర్రమాద కృష్ణారెడ్డి సూచించారు. మహాత్మా గాంధీ యూనివర్సిటీలో నిర్వహించిన ప్రత్యేక అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అధికారులకు ఆర్‌టీఐ చట్టంపై విస్తృతంగా అవగాహన కల్పించారు. యూనివర్సిటీ పరిధిలోని ఆర్ట్స్ బ్లాక్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పౌర సమాచార అధికారులు (PIOs), సహాయ పౌర సమాచార అధికారులు (APIOs), ఆర్‌టీఐ విభాగాన్ని పర్యవేక్షించే సిబ్బంది పాల్గొన్నారు. ఆర్‌టీఐ దరఖాస్తుల పరిష్కారంలో పాటించాల్సిన విధివిధానాలు, సమాచారాన్ని అందించాల్సిన కాలపరిమితి, వసూలు చేయాల్సిన రుసుములు, చట్టపరమైన మినహాయింపులపై డాక్టర్ కృష్ణారెడ్డి స్పష్టతనిచ్చారు.మొదటి, రెండవ అప్పీల్ విచారణల నిర్వహణ విధానం, పౌర సమాచార అధికారులు నిర్వహించాల్సిన రికార్డుల ప్రాముఖ్యతను ఆయన వివరించారు. ముఖ్యంగా ఆర్‌టీఐ చట్టంలోని సెక్షన్ 4(1)(బి) ప్రకారం ప్రజలకు స్వచ్ఛందంగా అందించాల్సిన సమాచారాన్ని నిర్లక్ష్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.సదస్సు ముగింపులో అధికారులు అడిగిన పలు సందేహాలకు చట్టపరమైన పరిష్కార మార్గాలను వివరించిన డాక్టర్ కృష్ణారెడ్డి, విధి నిర్వహణలో ఉపయుక్తమయ్యే స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీకి చెందిన పలువురు ఉద్యోగులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి....

- చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే కఠిన చర్యలు...
- ఎస్సై జానకి రామ్ రెడ్డి.....




**తలకొండపల్లి, మే15(నేటి దర్శిని);** బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని తలకొండపల్లి ఎస్సై జానకి రామ్ రెడ్డి అన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు తలకొండపల్లి పోలీస్ స్టేషన్లో శుక్రవారం కీలక సమావేశం నిర్వహించారు. గోసంరక్షణ సంఘాల ప్రతినిధులు మరియు హిందూ సంస్థల కార్యకర్తలతో జరిగిన ఈ భేటీలో శాంతిభద్రతల పరిరక్షణ పై పోలీసు అధికారులు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై జానకి రామ్ రెడ్డి మాట్లాడుతూ పండుగ పూట ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు ఇవ్వకుండా అందరూ సంయమనం పాటించాలని సూచించారు. సమాజంలో శాంతికి విఘాతం కలిగించే చర్యలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఏదైనా సమాచారం ఉన్నప్పుడు నేరుగా పోలీసులకు తెలియజేయాలి తప్ప ఎవరు చట్టాన్ని తమ చేతుల్లోకి



తీసుకోకూడదని హెచ్చరించారు. పశువుల రవాణా మరియు వదకు సంబంధించి ప్రభుత్వం ఉన్నతాధికారులు జారీ చేసిన తాజా నిబంధనలను ప్రజాప్రతినిధులకు వివరించారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దని, శాంతిని దెబ్బతీసేలా ప్రవర్తించే వారిపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని, పండుగను ప్రశాంతంగా జరుపుకునేలా తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# నల్గొండ ఎఫ్‌సీఐ గోదాంలో భారీ అగ్నిప్రమాదం..





- మూడు షెడ్లు పూర్తిగా దగ్గం
- పాత ఫైళ్లు, రికార్డులు అగ్నికి ఆహుతి
- ప్రోక్లైన్‌తో తలుపులు ధ్వంసం చేసి మంటల అదుపు
- కరెంటు కనెక్షన్ లేకపోవడంతో అనుమానాలు
- ఘటనపై సమగ్ర విచారణ కోరుతున్న అధికారులు

**నల్గొండ, మే 15 (నేటి దర్శిని):** నల్గొండ జిల్లా కేంద్ర పరిధిలోని పెద్దబండ సమీపంలోని భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) గోదాంలో శుక్రవారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఘటనలో మూడు షెడ్లు పూర్తిగా దగ్ధమవగా, పాత రికార్డులు, ఫైళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు మెరుపు వేగంతో ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు. స్థానికులు 100 నంబర్‌కు సమాచారం అందించడంతో టూ టౌన్ ఎస్ఐ రాఘవరావు పోలీసు సిబ్బందితో కలిసి హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. అనంతరం ఫైర్ సిబ్బందికి సమాచారం అందించి సహాయక చర్యలు చేపట్టారు. గొల్లగూడ, పెద్దబండ ప్రాంతాలకు చెందిన యువకులు కూడా పెద్ద సంఖ్యలో చేరుకుని మంటలు ఆర్పేందుకు సహకరించారు. గోదాంలోని రికార్డు రూమ్‌లో మంటలు తీవ్రంగా వ్యాపించడంతో అగ్నిమాపక సిబ్బంది లోపలికి వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఐరన్ తలుపులకు తాళాలు అందుబాటులో లేకపోవడంతో ప్రోక్లైన్ సహాయంతో తలుపులను ధ్వంసం చేసి మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నాలు నిర్వహించారు. ఈ ఘటనపై అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. షార్ట్‌సర్క్యూట్ కారణమా లేక ఇతర కారణాలున్నాయా అన్న కోణంలో విచారణ కొనసాగుతోంది. ముఖ్యంగా దగ్ధమైన మూడు షెడ్లకు విద్యుత్ కనెక్షన్ లేదని ఎఫ్‌సీఐ డివిజనల్ మేనేజర్ తెలిపారు. అందులో విలువైన వస్తువులు లేవని, ప్రధానంగా పాత రికార్డులు మాత్రమే నిల్వ ఉంచినట్లు వెల్లడించారు. జిల్లాకు సంబంధించిన ధాన్యం, బియ్యం నిల్వల కోసం సుమారు 20 గోదాములు ఉన్నాయని, దగ్ధమైన గోదాంలో సీఎంఆర్ రైస్ మిల్లులకు సంబంధించిన కొన్ని కేసుల ఫైళ్లు కూడా ఉన్నాయని సమాచారం. అయితే బియ్యానికి సంబంధించిన ఎలాంటి కెమికల్స్ లేదా నిల్వలు దగ్ధం కాలేదని అధికారులు స్పష్టం చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని అధికారులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ద్వారకాపురంలో "మహిరామ్" డాన్స్ స్టూడియో ప్రారంభం





**చైతన్యపురి, మే15 (నేటి దర్శిని):** చైతన్యపురి డివిజన్ పరిధిలోని ద్వారకాపురంలో మహి మరియు రామ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "మహిరామ్" డాన్స్ స్టూడియోను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి చైతన్యపురి బీఆర్ఎస్ నాయకుడు చంద్రశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు శశిధర్ రెడ్డి, ప్రముఖ డాన్స్ మాస్టర్ చెర్రీ హాజరై స్టూడియోను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యువతలో నృత్య కళాపై ఆసక్తి పెంపొందించేందుకు ఇలాంటి డాన్స్ స్టూడియోలు ఉపయోగపడతాయని తెలిపారు. చిన్నారులు, యువత తమ ప్రతిభను మెరుగుపర్చుకునేందుకు "మహిరామ్" డాన్స్ స్టూడియో మంచి వేదికగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, సాయి ప్రశాంత్, చింటు, జలంధర్, పులి కిరణ్, శ్రీధర్, సాయి, నాగరాజు తదితరులు పాల్గొని నిర్వాహకులను అభినందించారు.

# మునుగోడు నియోజకవర్గ ప్రథమ ర్యాంకర్ ను అభినందించిన ఎమ్మెల్యే

- పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే
- గాంధీజీ విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి



**చండూరు,మే15 (నేటి దర్శిని):** ఇటీవల ప్రకటించిన పదవ తరగతి ఫలితాలలో చండూరు మున్సిపాలిటీ కి చెందిన గాంధీజీ విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి 588 /600 మార్కులతో కారింగు దీక్షిత మునుగోడు నియోజకవర్గం మొదటి ర్యాంకును సాధించినందులకు గాను మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి శాలువా కప్పి, పుష్పగుచ్చమును అందించి ఘనంగా సన్మానించి, అభినందించారు. అలాగే 580 మార్కులు సాధించిన శిరంశెట్టి అక్షరను, 579 మార్కులు సాధించిన కందుల దివ్యను, 575 మార్కులు సాధించిన తుమ్మల జయశ్రీని, 573 మార్కులు సాధించిన ఆలేటి శిరీషను, 572 మార్కులు సాధించిన భూతరాజు ఐశ్వర్యను, 571 మార్కులు సాధించిన నారాబోయిన కుమార స్వామిలందరిని అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ గాంధీజీ విద్యాసంస్థలు గత సంవత్సరం 590 మార్కులతో జిల్లా మొదటి ర్యాంకులు సాధించి, మళ్లీ ఈ సంవత్సరం కూడా 588 మార్కులను సాధించి మునుగోడు నియోజకవర్గం లో మొదటి స్థానంలో ఉండడం గర్వకారణం అని అన్నారు. విద్యార్థులందరూ బాగా కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, పుట్టిన ఊరుకు, కన్న తల్లిదండ్రులకు, చదివిన పాఠశాలకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. విద్యార్థులకు ఉత్తమ విద్యను అందిస్తున్న గాంధీజీ విద్యాసంస్థల యాజమాన్యంను, ఉపాధ్యాయ బృందంను అభినందించారు. ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, కర్నాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై ఎల్‌బీనగర్‌లో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**ఎల్‌బీనగర్, మే15 (నేటి దర్శిని):** పెట్రోల్, డీజిల్ ధరలను నిరంతరం పెంచుతూ ప్రజలపై అదనపు భారం మోపుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ చౌరస్తాలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అదుపు లేకుండా ఇంధన ధరలను పెంచడం వల్ల సామాన్య ప్రజల జీవనం తీవ్రంగా ప్రభావితమవుతోందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగి ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రజల తరపున ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టామని, ఇలాంటి అన్యాయ ధరల పెంపులను అడ్డుకునేందుకు భవిష్యత్తులో కూడా ఉద్యమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, మాజీ చైర్మన్లు, నియోజకవర్గ సీనియర్ నాయకులు, వివిధ డివిజన్ల అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాళ్లు, యువ నాయకులు, మహిళా నాయకులు, అనుబంధ కమిటీ సభ్యులు, కార్యకర్తలు మరియు పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు.. ఆధునిక సాగుపై అవగాహన



**నిడమానూరు, మే 15 (నేటి దర్శిని):** నిడమానూరు మండలం ఇండ్లకోట గూడెంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం నిర్వహించారు. రైతులకు ఆధునిక సాగు విధానాలు, భూసార పరిరక్షణ, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ పరిశోధన స్థానం కంపసాగర్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ రైతులు యూరియా వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకుని అవసరమైన మేరకే ఎరువులు వినియోగించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడవచ్చన్నారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న వరి రకాలను సాగు చేయాలని రైతులకు సూచించారు. కేవీకే కంపసాగర్ ఉద్యాన శాస్త్రవేత్త టి. హిమబిందు మాట్లాడుతూ రైతులు వరి పంటకే పరిమితం కాకుండా కూరగాయలు, పండ్ల తోటలు, ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలన్నారు. సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను వివరించి కనీసం కుటుంబ అవసరాల మేరకైనా సేంద్రీయ సాగును ప్రారంభించాలని కోరారు. ఉద్యాన అధికారి రిషిత మాట్లాడుతూ ఉద్యాన శాఖ ద్వారా రైతులకు అందిస్తున్న సబ్సిడీ పథకాల వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఏఓ ముని కృష్ణయ్య, ఏఈఓ అనిల్ నాయక్, హెచ్ఈఓ బి. సైదులు, ఫీల్డ్ ఆఫీసర్ (పతంజలి) చి. ప్రసాద్, రంజీత్, సర్పంచ్ పి. కృష్ణయ్య, ఆదర్శ రైతులు జె. రాంబాబు, బి. వెంకయ్య, స్వయం సహాయక సంఘ మహిళలు పి. విజయలక్ష్మి, ఎన్. నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. రైతులు, మహిళలు, అధికారులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కూరగాయల కమీషన్ వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి..

- మార్కెట్ కమిటీ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి...



**ఆమనగల్లు మే15(నేటి దర్శిని);** ఆమనగల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు తాళ్ల రవీందర్, జెల్లా రమేష్ శుక్రవారం తనిఖీలను నిర్వహించారు. పట్టణంలోని అంగడి బజారులోని కూరగాయల కమిషన్ ఏజెంట్లను ట్రేడ్ లైసెన్స్ లేకుండా కమీషన్ ఏజెంట్ వ్యాపారం నిర్వహించరాదని, వెంటనే లైసెన్సులను తీసుకోవాలని కోరారు. మార్కెట్లో తిరిగి కూరగాయల మద్దతు ధరలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆమనగల్ మార్కెట్ యార్డులో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఏఎంసీ డైరెక్టర్ తాళ్ల రవీందర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల నుంచి ప్రతి చివరిగింజ వరకు కొనుగోలు చేస్తుందని చెప్పడం జరిగింది. దళారులను నమ్మి మోసపోవద్దని ఒడ్లు మాచర్ల వచ్చే రోడ్లను వెంటనే కొనుగోలు చేస్తామని మాచర్ల రాణి రైతులు ఆందోళన పడాల్సిన పనిలేదని, రెండు రోజుల్లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూరగాయల వ్యాపారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# క్రషర్ యజమానులపై చర్యలు తీసుకోండి

- కాలుష్యంతో బతకలేక పోతున్నాము



**మిడ్జిల్, మే 15, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** బాలానగర్ మండలంలోని గౌతాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని సర్వేనెంబర్ 140లో కే. రాజశేఖర్ మరియు సర్వేనెంబర్ 15, 16, 140లో దామోదర్ క్రషర్ మరియు సర్వేనెంబర్ 16, 19, 20లో కొత్త కాపు వెంకట్ రెడ్డి శేఖర్ రెడ్డి క్రషర్ లలో భారీగా బ్లాస్టింగ్ జరుగుతున్నాయని డిప్యూటీ తాసిల్దార్ లిఖితారెడ్డికి శుక్రవారం గ్రామపంచాయతీ పాలకమండలి ఫిర్యాదు చేశారు. బ్లాస్టింగ్ జరిగిన ప్రతిసారి గౌతాపూర్ లోని అన్ని నివాస గృహాలు కాలుష్యంతో దుమ్ము ధూళితో నిండిపోవడమే కాకుండా.. పెద్ద శబ్దం రావడంతో, ఇండ్లు కదిలి శిథిలా వ్యవస్థకు చేరుకుంటున్నాయన్నారు. కష్టాలతో ప్రజలంతా తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నామన్నారు. సంబంధిత క్రషర్ యజమానులు పైన చర్యలు తీసుకోవాలని.. అలాగే పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులుగా చర్యలు తీసుకొని తమను రక్షించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రకాష్, ఉప సర్పంచ్ పెద్దోని యాదయ్య, వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# బిజినెస్

## అత్యంత కనిష్టానికి పడిపోయిన రూపాయి..
# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్



భారత స్టాక్ మార్కెట్లు శుక్రవారం నష్టాల్లో ముగిశాయి. రూపాయి విలువ అత్యంత కనిష్టానికి పతనమవడం, క్రూడాయిల్ ధరలు పెరగడం మార్కెట్లపై దుష్ప్రభావం చూపింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 160.73 పాయింట్లు (0.21 శాతం) నష్టపోయి 75,237.99 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ50 కూడా 46.10 పాయింట్లు (0.19 శాతం) నష్టపోయి 23,643.50 వద్ద ముగిసింది.రూపాయి విలువ తగ్గడం, చమురు ధరలు పెరుగుదల, ద్రవ్యోల్బణం పెరుగుతుందనే భయం వంటివి ఇన్వెస్టర్లపై ప్రభావం చూపాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు ఇంకా కొనసాగడం, హార్ముజ్ జలసంధి పూర్తి స్థాయిలో తెరుచుకోకపోవడం వంటివి కూడా ఇందుకు కారణాలు. ఈ కారణాలతో చమురు ధరలు పెరుగుతున్నాయి. అంతర్జాతీయంగా బ్యారెల్ క్రూడాయిల్ ధర 109 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. మరోవైపు భారతీయ రూపాయి అత్యంత కనిష్ట స్థాయికి చేరింది. డాలర్‌తో రూపాయి విలువ 96.05 వద్ద ట్రేడవుతోంది. అంతకుముందు ఇది 95.9575 వద్ద కొనసాగింది. రూపాయి అత్యంత తక్కువ స్థాయికి చేరుకోవడం కూడా మార్కెట్లపై ప్రభావం చూపింది. రూపాయి ఇంత తక్కువ స్థాయికి పడిపోవడం ఇదే మొదటిసారి. ఈ రోజు 0.3 శాతం తగ్గింది. చమురు ధరల పెరుగుదల, విదేశీ ద్రవ్యం అధికం కావడం, పశ్చిమాసియాలో అస్థిరత వంటివి రూపాయి పతనానికి కారణాలు. ఇండియా చమురు దిగుమతులపైనే ఎక్కువగా ఆధారపడుతున్న సంగతి తెలిసిందే. అలాగే, అమెరికా వడ్డీ రేట్లు, మారక నిల్వలు తగ్గడం కూడా కారణాలుగా చెప్పుకోవచ్చు.

## బంగారం ప్రియులకు ఊరట
# భారీగా తగ్గిన పసిడి ధరలు!

### గోల్డ్, సిల్వర్ రేట్స్.. భారీగా ధరల పతనం



ఇంటర్నెట్ డెస్క్

భారత్‌లో బంగారం ధరల ర్యాలీకి బ్రేక్ పడినట్టు కనిపిస్తోంది. అంతర్జాతీయ అనిశ్చితులు, కేంద్రం దిగుమతి సుంకాల పెంపు నేపథ్యంలో నేడు బంగారం, వెండి ధరల్లో భారీ కోత కనిపించింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, (మే 15) ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,60,090కు పడిపోయింది. నిన్నటి ముగింపుతో పోలిస్తే ధరలో ఏకంగా రూ.2,240ల మేర కోత పడింది. 22 క్యారెట్ల పసిడి ధర కూడా రూ.1,46,750కు చేరుకుంది. నిన్నటితో పోలిస్తే ధర రూ.2,050ల మేర తగ్గింది. నగరంలో వెండి ధరలో కూడా రూ.10 వేల కోత పడింది. ప్రస్తుతం కిలో వెండి రూ.3.05 లక్షల వద్ద ట్రేడవుతోంది ఇతర ప్రధాన నగరాల విషయానికి వస్తే చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,63,390గా ఉంది. ఢిల్లీలో రూ.1,60,240గా, ముంబైలో రూ.1,60,090 వద్ద కొనసాగుతోంది. చెన్నైలో 22 క్యారెట్ల ఆర్నమెంటల్ పసిడి ధర రూ.1,49,500గా, ఢిల్లీలో రూ.1,46,900గా, ముంబైలో రూ.1,46,750గా ఉంది. చెన్నై సహా పలు నగరాల్లో వెండి దర రూ.3.05 లక్షల వద్ద ట్రేడవుతోంది. నిన్నటితో పోలిస్తే దేశంలో కిలో వెండి ధర రూ.10 వేల మేర తగ్గింది.


# బీఎస్ఎన్ఎల్ సరికొత్త చౌక ప్లాన్..

### రూ. 225కే అపరిమిత డేటా, కాలింగ్



ప్రైవేట్ టెలికాం సంస్థల ధరల పెరుగుదల నేపథ్యంలో, ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ సామాన్యులకు ఊరటనిచ్చేలా సరికొత్త ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. కేవలం రూ. 225 ధరతో ప్రవేశపెట్టిన ఈ ప్లాన్, డేటా ఎక్కువగా వాడే యూజర్లను దృష్టిలో ఉంచుకుని రూపొందించారు. ఈ ప్లాన్ ద్వారా నెలకు సుమారు 75 జీబీ డేటాను బీఎస్ఎన్ఎల్ అందిస్తోంది. రోజుకు 2.5 జీబీ హై-స్పీడ్ డేటా లభిస్తుంది. అంటే నెలకు సుమారుగా 75 జీబీ డేటాను వినియోగించుకోవచ్చు. ఇక వ్యాలిడిటీ విషయానికి వస్తే.. ప్రైవేట్ సంస్థలు 28 రోజుల వ్యాలిడిటీ ఇస్తుండగా, బీఎస్ఎన్ఎల్ ఈ ప్లాన్ ద్వారా పూర్తి 30 రోజుల వ్యాలిడిటీని అందిస్తోంది. ఏ నెట్‌వర్క్‌కైనా అపరిమిత కాల్స్ మాట్లాడుకునే సౌకర్యం, రోజుకు 100 ఎస్ఎంఎస్ లు కూడా ఈ ప్లాన్‌లో ఉన్నాయి. వర్క్ ఫ్రమ్ హోమ్ చేసే వారికి, ఆన్‌లైన్ క్లాసులకు హాజరయ్యే విద్యార్థులకు తక్కువ ధరలో ఎక్కువ డేటా కోరుకునే వారికి ఈ ప్లాన్ ఒక వరం లాంటిది. రోజువారీ కోటా ముగిసిన తర్వాత కూడా తక్కువ వేగంతో ఇంటర్నెట్ సదుపాయం కొనసాగుతుంది. దేశవ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ తన నెట్‌వర్క్‌ను ఆధునీకరిస్తున్న తరుణంలో, ఈ చవకైన ప్లాన్ కస్టమర్లను భారీగా ఆకర్షిస్తుందని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు.

## వన్డే ప్రపంచకప్ ఆడాలని ఉంది..
# కానీ, సెలెక్టర్లు ఏమంటారో..!



ఐపీఎల్‌లో తొమ్మిదో శతకంతో చెలరేగిన విరాట్ కోహ్లీ ఆట చూస్తుంటే మరో రెండేళ్లు అతడికి తిరుగులేదని అనిపిస్తోంది. వరసగా రెండు గోల్డెన్ డకౌట్‌ల నుంచి తేరుకొని సెంచరీతో విరుచుకుపడిన కోహ్లీ వన్డే వరల్డ్ కప్‌లో ఇలానే ఆడితే చూసి తరించాలని అభిమానులు అనుకుంటున్నారు. విరాట్ సైతం ప్రపంచకప్ ఆడాలనే ఉద్దేశంతోనే ఉన్నట్టుగా తెలుస్తోంది. ఆర్సీబీ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. 'దేశం తరఫున వరల్డ్‌కప్ ఆడడం కంటే గొప్ప విషయం ఏముంటుంది' అని కోహ్లీ నవ్వుతూ బదులిచ్చాడు.అంతర్జాతీయ క్రికెట్‌లో టన్నుల కొద్దీ పరుగులు.. వన్డేల్లో శతకాల ఫిఫ్టీతో రికార్డులు నెలకొల్పిన విరాట్ కోహ్లీ తదుపరి లక్ష్యం? ఏంటో తెలుసా.. వన్డే ప్రపంచ కప్. ఐపీఎల్ పద్దెనిమిదో సీజన్‌తో ఆర్సీబీ కలను సాకారం చేసిన విరాట్ వచ్చే ఏడాది ప్రపంచకప్ ఆడేందుకు సిద్ధమవుతున్నాడు. ఆస్ట్రేలియా పర్యటన, ఆపై స్వదేశంలో దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో శతకాలతో రెచ్చిపోయిన అతడు.. దేశవాళీ టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలోనూ దంచేశాడు. ఇప్పుడు ఐపీఎల్ 19లోనూ కుర్రాడిలా రెచ్చిపోతున్నాడు. అతడి ఫామ్ చూస్తుంటే వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ కప్ ఆడేలా ఉన్నాడు? అని అందరూ అనుకుంటున్నారు. ఇదే విషయంపై ఆర్సీబీ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. నాకు ప్రపంచకప్ ఆడాలనే ఉంది అని మనసులోని మాట చెప్పేశాడు.మైదానంలోకి దిగాక జట్టులో ఉత్సాహం నింపడం, విజయంలో భాగమవ్వడం మీదే నా దృష్టంతా ఉంటుంది. నన్ను నేను నిరూపించుకోవాలని ఆడను. నేను ఇప్పుడు ఆ పరిస్థితిలో లేను కూడా. ఎందుకంటే మ్యాచ్ సన్నద్ధత పట్ల, మైదానంలోకి దిగాక ఎలా ఆడాలి? అనే విషయాల పట్ల నేను నిజాయతీగా ఉంటాను. అందుకని తల కిందకు వంచి.. నెట్స్‌లో కష్టపడతాను. నా క్రికెట్ కెరీర్‌లో అన్నీ ఇచ్చినందుకు ఆ దేవుడికి కృతజ్ఞతలు. నాకు అవకాశం వచ్చినందుకు ఎంతో గర్వపడతాను. ఇక ఆట విషయానికొస్తే.. వన్డేల్లో 40 ఓవర్ల పాటు బౌండరీ నుంచి అవతలి బౌండరీ వరకూ పరిగెత్తమని చెప్పినా.. నేను పరుగెడుతాను.యాభై ఓవర్లకు తగ్గట్టుగా నేను సన్నద్ధమవుతా. నేను ఎదుర్కొనే ప్రతి బంతిని ఇదే నా కెరీర్లో చివరి బంతి అనుకుంటూ బ్యాటింగ్ కొనసాగిస్తా. అంతేనా.. వికెట్ల మధ్యలో చకచకా పరుగుతీస్తా. జట్టుకు అవసరమైన ప్రతిదీ చేసేందుకు నేను ఎల్లప్పుడూ సిద్ధమే. విజయ్ హజారే ట్రోఫీలో గొప్పగా ఆడాను. వరల్డ్‌కప్ గురించి అడిగితే.. నాకూ ఆడాలనే ఉంది. కానీ, అది నా ఒక్కడి నిర్ణయం సరిపోదు. జట్టుకు కూడా నా అవసరం ఉందని సెలెక్టర్లు అనుకోవాలి. అప్పుడే వరల్డ్‌కప్ ఆడగలను' అని విరాట్ పేర్కొన్నాడు.రెండేళ్ల క్రితం టీ20, టెస్టులకు వీడ్కోలు పలికిన విరాట్.. ప్రస్తుతం అంతర్జాతీయంగా వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నాడు. 2011లో ధోనీ సారథ్యంలో వరల్డ్‌కప్ గెలిచిన జట్టులో సభ్యుడైన విరాట్.. ఇటీవల రోహిత్ శర్మ కెప్టెన్సీలో ఛాంపియన్స్ ట్రోఫీ విజయంలోనూ కీలకమయ్యాడు. అదే ఉత్సాహంతో 2027 వన్డే ప్రపంచకప్ ఆడి దేశానికి మరో ఐసీసీ ట్రోఫీ కట్టబెట్టాలని అతడు ఆశపడుతున్నాడు. అయితే.. మన సెలెక్టర్లు ఏం చేస్తారో చూడాలి.

# బీసీసీఐ రూల్స్‌లో ఊహించని ట్విస్ట్!

ఐపీఎల్ 2026 సీజన్ క్లైమాక్స్‌కు చేరుకుంది. మే 24తో లీగ్ దశ మ్యాచ్‌లు ముగియనుండగా.. మే 26 నుంచి ప్లేఆఫ్స్ సమరం మొదలవుతుంది. అయితే ఈ కీలక మ్యాచ్‌లకు వర్షం ముప్పు పొంచి ఉండటంతో క్రికెట్ అభిమానుల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో ప్లేఆఫ్ మ్యాచ్‌లకు సంబంధించి బీసీసీఐ రూపొందించిన ప్రత్యేక నిబంధనల గురించి తెలుసుకుందాం.సాధారణంగా నాకౌట్ మ్యాచ్‌లన్నింటికీ రిజర్వ్ డే ఉంటుందని అందరూ భావిస్తారు. కానీ బీసీసీఐ నిబంధనల ప్రకారం క్వాలిఫయర్-1, ఎలిమినేటర్, క్వాలిఫయర్-2 మ్యాచ్‌లకు రిజర్వ్ డేలు లేవు. కేవలం ఫైనల్ మ్యాచ్‌కు మాత్రమే రిజర్వ్ డే కేటాయించబడింది. అంటే మొదటి మూడు నాకౌట్ మ్యాచ్‌లను ఏ రోజున నిర్ణయించారో అదే రోజున ఫలితాన్ని తేల్చాల్సి ఉంటుంది. వర్షం పడితే ఆటను పూర్తి చేయడానికి లీగ్ మ్యాచ్‌ల కంటే అదనంగా 120 నిమిషాల సమయం కేటాయిస్తారు.ఒకవేళ ప్లేఆఫ్ మ్యాచ్ జరిగే రోజున వర్షం కురిస్తే అంపైర్లు మొదట 20 ఓవర్ల పూర్తి మ్యాచ్ నిర్వహించడానికి ప్రయత్నిస్తారు. అది సాధ్యం కాకపోతే ఓవర్లను తగ్గిస్తూ వచ్చి కనీసం 5 ఓవర్ల చొప్పున మ్యాచ్ జరిగేలా చూస్తారు. ఒకవేళ 5 ఓవర్ల మ్యాచ్ కూడా జరగని పక్షంలో కనీసం ఫలితం కోసం సూపర్ ఓవర్ నిర్వహించే అవకాశం ఉందో లేదో పరిశీలిస్తారు. మైదానం పరిస్థితి సహకరిస్తే సూపర్ ఓవర్ ద్వారా విజేతను నిర్ణయిస్తారు.అదనపు సమయం తర్వాత కూడా వర్షం తగ్గకపోతే లేదా సూపర్ ఓవర్ కూడా నిర్వహించే అవకాశం లేకపోతే, బీసీసీఐ నిబంధనల ప్రకారం లీగ్ దశలో సాధించిన పాయింట్ల పట్టిక కీలకంగా మారుతుంది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న జట్టును విజేతగా ప్రకటిస్తారు. ఉదాహరణకు, క్వాలిఫైయర్-1లో మొదటి, రెండో స్థానాల్లోని జట్ల మధ్య మ్యాచ్ వర్షం వల్ల రద్దయితే, టేబుల్ టాపర్‌గా ఉన్న జట్టును నేరుగా ఫైనల్‌కు పంపిస్తారు. ఎలిమినేటర్ మ్యాచ్‌లో కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. మిగిలిన మ్యాచ్‌లతో పోలిస్తే ఫైనల్‌కు రూల్స్ కాస్త సరళంగా ఉంటాయి. ఫైనల్ మ్యాచ్‌కు రిజర్వ్ డే ఉన్నందున నిర్ణీత రోజున వర్షం వస్తే మరుసటి రోజు ఆటను కొనసాగిస్తారు. ఒకవేళ ఫైనల్ రోజున మ్యాచ్ సగం జరిగాక ఆగిపోతే.. రిజర్వ్ డే నాడు అక్కడి నుంచే ఆట ప్రారంభమవుతుంది. రిజర్వ్ డే నాడు కూడా వర్షం కారణంగా కనీసం 5 ఓవర్ల ఆట లేదా సూపర్ ఓవర్ సాధ్యపడకపోతే, అప్పుడు లీగ్ దశలో పాయింట్ల పట్టికలో టాప్ ప్లేస్‌లో ఉన్న జట్టును ఐపీఎల్ 2026 ఛాంపియన్‌గా ప్రకటిస్తారు.

# స్పోర్ట్స్

# పాకిస్థాన్‌కు బిగ్ షాక్..

### డబ్ల్యూటీసీలో ఏకంగా 8 పాయింట్లు కోత..!



బంగ్లాదేశ్ పర్యటనలో దారుణ ఓటమిని మరిచిపోకముందే పాకిస్థాన్ కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఢాకా టెస్టులో స్లో ఓవర్ రేటు కు పాక్ భారీ మూల్యం చెల్లించుకుంది. మ్యాచ్ ఫీజులో కోతతో పాటు ఆ జట్టు ర్యాంకింగ్‌లోనూ దిగజారింది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో కీలకమైన పాయింట్లు కోల్పోయింది. ఒకటి రెండు కాదు ఏకంగా 8 పాయింట్లు కోతకు గురైంది షాన్ మసూద్ బృందం.ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025-27లో పాకిస్థాన్‌కు ఊహించని షాక్. బంగ్లాదేశ్ చేతిలో 104 పరుగుల తేడాతో తొలి టెస్టులో ఓటమి పాక్ ర్యాంకింగ్స్‌ను దెబ్బతీసింది. ఆ మ్యాచ్‌లో స్లో ఓవర్ రేటు కారణంగా మ్యాచ్ ఫీజులో 40 శాతం కోల్పోయింది. నిర్ణీత సమయానికి ఎనిమిది ఓవర్లు వెనుకంజలో ఉండడంతో జరిమానా కింద డబ్ల్యూటీసీలో 8 పాయింట్ల కోత పడింది. ప్రస్తుతం ఆస్ట్రేలియా అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. న్యూజిలాండ్ రెండులో ఉంది. దక్షిణాఫ్రికా, శ్రీలంక, పాకిస్థాన్ వరసగా మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచాయి.నహీద్ **విజృంభణతో..**

ఢాకా వేదికగా జరిగిన తొలి టెస్టులో పాకిస్థాన్ బ్యాటర్లను వణికిస్తూ బంగ్లాదేశ్ భారీ విజయాన్నందుకుంది. దమ్ముంటే మా ముందు 70 ఓవర్లలో 260పైగా లక్ష్యాన్ని నిర్దేశించండి అని సవాల్ విసిరిన సల్మాన్ అఘా తల పొగరను అణచివేస్తూ సిరీస్‌లో ఆధిక్యంలోకి వెళ్లింది.మొదటి ఇన్నింగ్స్‌లో కాస్తో కూస్తో పోరాడిన పాక్.. రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం కుప్పకూలింది. నహిద్ రాణా(5-40) బంతితో చెలరేగిన వేళ బంగ్లా 104 పరుగుల తేడాతో గెలుపొందింది. తద్వారా స్వదేశంలో పాక్‌పై బంగ్లాదేశ్ మొదటి విజయంతో చరిత్ర సృష్టించింది. ఇరుజట్ల మధ్య మే 16 నుంచి రెండో టెస్టు జరుగనుంది.


# పెద్ది ప్రమోషన్లలో కొత్త ఎమోషన్

## బుచ్చిబాబును లాంగ్ డ్రైవ్ తీసుకెళ్లిన రామ్‌చరణ్




రామ్ చరణ్, బుచ్చిబాబు కాంబినేషన్‌లో వస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ 'పెద్ది' విడుదలకు సిద్ధమవుతోంది. జూన్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో, చిత్ర యూనిట్ ప్రమోషన్ల స్పీడ్ పెంచింది. సినిమాపై హైప్ క్రియేట్ చేసేందుకు సరికొత్తగా ప్లాన్ చేస్తోంది. తాజాగా హీరో రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు ప్రచారంలో భాగంగా ఒక ప్రత్యేకమైన ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. అయితే ఇది మామూలు ఇంటర్వ్యూలా కాకుండా, రామ్ చరణ్ స్వయంగా కారు డ్రైవ్ చేస్తూ బుచ్చిబాబును ఒక షికారుకి తీసుకెళ్లారు. ప్రయాణంలోనే వీరిద్దరూ సినిమా ముచ్చట్లను పంచుకున్నారు. ఈ సందర్భంగా బుచ్చిబాబు మాట్లాడుతూ.. సినిమా పనులతో ఇంత బిజీగా ఉన్నప్పటికీ, నన్ను ఇలా లాంగ్ డ్రైవ్‌కు తీసుకువచ్చినందుకు థాంక్యూ చరణ్ సార్ అంటూ తన ఆనందాన్ని పంచుకున్నారు. దానికి చరణ్ స్పందిస్తూ.. 'అదంతా సరే కానీ, మన 'పెద్ది' సినిమా ఎప్పుడు వస్తుందో ప్రేక్షకులకు కచ్చితంగా చెప్పు' అని నవ్వుతూ అడిగారు. దీంతో వీరిద్దరూ కలిసి జూన్ 4న 'పెద్ది' సినిమా థియేటర్లలోకి వస్తోందని అధికారికంగా ప్రకటించారు. భారీ అంచనాలతో వస్తున్న ఈ చిత్రాన్ని ప్రేక్షకులందరూ థియేటర్లలో చూసి ఎంజాయ్ చేయాలని రామ్ చరణ్, బుచ్చిబాబు కోరారు.

# ఓటీటీలోకి సైలెంట్‌గా వచ్చేసిన నాగ శౌర్య 'బ్యాడ్ బాయ్ కార్తీక్'.





టాలీవుడ్ యంగ్ హీరో నాగ శౌర్య ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'బ్యాడ్ బాయ్ కార్తీక్' థియేటర్లలో పెద్దగా హడావుడి లేకుండానే విడుదలై ప్రేక్షకుల దృష్టిని పెద్దగా ఆకర్షించలేకపోయింది. సినిమా విడుదలైన విషయం కూడా చాలామందికి తెలియని పరిస్థితి నెలకొనగా, ఇప్పుడు ఇదే చిత్రం ఎలాంటి ముందస్తు ప్రకటనలు లేకుండా నేరుగా ఓటీటీలోకి వచ్చేయడం ఆసక్తికరంగా మారింది.ఈ సినిమాకి డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను అమెజాన్ ప్రైమ్ వీడియో దక్కించుకుంది. ఇప్పటికే ఈ చిత్రం ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి వచ్చినట్లు తెలుస్తోంది. థియేటర్లలో మిస్ అయిన ప్రేక్షకులు ఇప్పుడు ఇంటి వద్ద నుంచే ఈ సినిమాను వీక్షించే అవకాశం పొందుతున్నారు.'బ్యాడ్ బాయ్ కార్తీక్' చిత్రానికి కొత్త దర్శకుడు రమేష్ దేసిన దర్శకత్వం వహించారు. సినిమా యాక్షన్ ఎపిసోడ్స్‌ను స్టైలిష్‌గా తెరకెక్కించినప్పటికీ, ప్రధాన కథా కథనాలు మాత్రం పాత తరహాలో సాగడంతో ప్రేక్షకులను పూర్తిగా ఆకట్టుకోలేకపోయిందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా స్క్రీన్‌ప్లేలో కొత్తదనం లేకపోవడం సినిమాకు ప్రధాన మైనస్‌గా మారిందని సినీ వర్గాలు చెబుతున్నాయి.ఈ చిత్రంలో శ్రీదేవి విజయ్ కుమార్, సముద్రఖని కీలక పాత్రల్లో నటించగా, హీరోయిన్‌గా విధి యాదవ్ కనిపించింది. సంగీత దర్శకుడు హారీష్ జైరాజ్ ఈ సినిమాకు సంగీతం అందించారు. నిర్మాణ బాధ్యతలను నిర్మాత శ్రీనివాసరావు చింతలపూడి నిర్వహించారు. థియేటర్లలో నిరాశపరిచిన ఈ చిత్రం ఓటీటీలో అయినా ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో చూడాలి. ముఖ్యంగా యాక్షన్ సినిమాలను ఇష్టపడే ప్రేక్షకులు ఒకసారి ట్రై చేయవచ్చని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.



# రాశి ఖన్నా గ్లామరస్ పిక్స్ వైరల్,

# మెగాఫోన్ పట్టిన రామ్ పోతినేని

టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని తన అభిమానులకు అదిరిపోయే బర్త్ డే సర్ప్రైజ్ ఇచ్చారు. ఇన్నాళ్లూ తన నటనతో, డ్యాన్స్‌తో వెండితెరపై మ్యాజిక్ చేసిన రామ్, ఇప్పుడు సరికొత్త అవతారంలోకి మారబోతున్నారు. తన 23వ చిత్రం ద్వారా రామ్ దర్శకుడిగా పరిచయం కాబోతున్నట్లు అధికారికంగా ప్రకటించాడు. ఈ వార్త ఇప్పుడు ఫిల్మ్ నగర్ వర్గాల్లో సంచలనంగా మారింది. ఎవరూ ఊహించని విధంగా ఒక ఉత్కంఠభరితమైన సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌తో రామ్ తన దర్శకత్వ ప్రయాణాన్ని ప్రారంభించ బోతున్నట్లు తెలుస్తుంది. ఈ చిత్రానికి 'వీర' అనే పవర్ ఫుల్ టైటిల్‌ను ఖరారు చేసినట్లు సమాచారం. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ అత్యంత ఆసక్తికరంగా ఉంది. 'ది స్టోరీ ఆఫ్ ఏ లోన్ వోల్ఫ్' అనే ట్యాగ్‌లైన్‌తో వచ్చిన ఈ పోస్టర్ చూస్తుంటే, రామ్ ఒక ఇంటెన్స్ రోల్‌లో కనిపించబోతున్నారని స్పష్టమవుతోంది. ఈ సినిమా కోసం రామ్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన సొంత నిర్మాణ సంస్థ అయిన 'స్రవంతి మూవీస్' ఉండగానే, ప్రత్యేకంగా 'రాపో సినిమాటిక్స్' అనే కొత్త ప్రొడక్షన్ హౌస్‌ను ప్రారంభించారు. తన కలల ప్రాజెక్ట్‌ను రామ్ సోదరుడు కృష్ణ పోతినేని ఈ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకం గా నిర్మించనున్నారు. దర్శకుడిగా తన నిర్ణయం గురించి రామ్ స్పందిస్తూ.. 'ఇన్నాళ్లు వాళ్ల కథల్లో నా ముఖం చూశారు.. ఈ కథలో నా గొంతు వింటారు' అంటూ పవర్ ఫుల్ కోట్‌ను షేర్ చేశారు. తనలోని మరో కోణాన్ని ఆవిష్కరించేందుకు రామ్ పూర్తి స్థాయిలో సిద్ధమైనట్లు ఈ మాటలు చెబుతున్నాయి. భారీ అంచనాలు నెలకొన్న ఈ చిత్రం డిసెంబర్‌లో ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది.






# ఆ హీరో నా ఫస్ట్ క్రష్.. అలాంటి భర్త రావాలి..

## –హీరోయిన్ అనన్య నాగళ్ల..

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ అనన్య నాగళ్ల గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. 'మల్లేశం' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన ఈ తెలుగమ్మాయి, పవన్ కళ్యాణ్ 'వకీల్ సాబ్' చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత తెలుగులో వరుస అవకాశాలు అందుకుంటూ బ్యాక్ టూ బ్యాక్ చిత్రాలతో మెప్పించింది. తక్కువ సమయంలోనే టాలీవుడ్ ఇండస్ట్రీలో విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. గతంలో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అనన్య తన సినీ ప్రయాణం గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. అలాగే తనకు ఇండస్ట్రీలో ఫస్ట్ క్రష్ గురించి చెబుతూ పెళ్లి గురించి మాట్లాడింది.ఇంటర్వ్యూలో తన పర్సనల్ లైఫ్ గురించి మాట్లాడుతూ, టాలీవుడ్ యంగ్ హీరో నాగశౌర్య తన మొదటి క్రష్ అని అనన్య వెల్లడించింది. తన చిన్నతనంలో అల్లు అర్జున్, మహేష్ బాబు, ప్రభాస్ సినిమాలు చూస్తూ పెరిగానని, వారి సినిమాలంటే తనకు చాలా ఇష్టమని చెప్పుకొచ్చింది. అయితే, ఇండస్ట్రీలో ప్రత్యేకంగా క్రష్ ఎవరైనా ఉన్నారా అంటే మాత్రం నాగశౌర్య పేరును ఆమె ప్రస్తావించింది. తనకు కాబోయే లైఫ్ పార్ట్నర్ ఎలా ఉండాలనే విషయంపై కూడా అనన్య క్లారిటీ ఇచ్చింది.”నాకు కాబోయేవాడు చాలా నిజాయితీగా (ఎశీఅవర్) ఉండాలి. ప్రస్తుతం నేను సరైన వ్యక్తి కోసం వెతుకుతున్నాను. ఇండస్ట్రీ వ్యక్తులతో రిలేషన్ అంటే కొంచెం భయమేస్తుంది. ఎందుకంటే అక్కడ అభిప్రాయభేదాలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అలాగే ఇప్పటివరకు నాకు ఎవరూ ప్రపోజ్ చేయలేదు” అని ఆమె చెప్పుకొచ్చింది. ప్రస్తుతం అనన్య చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. ప్రస్తుతం తెలుగులో వరుస సినిమాలతో అలరిస్తుంది.ఇండస్ట్రీలో క్యాస్టింగ్ కౌచ్ గురించి స్పందిస్తూ.. తనకు ఇప్పటివరకు అటువంటి చేదు అనుభవాలు ఎదురుకాలేదని స్పష్టం చేసింది. ఇక సోషల్ మీడియాలో తనపై వచ్చే కామెంట్స్ గురించి పెద్దగా పట్టించుకోనని, కేవలం తన పని మీద దృష్టి పెడతానని తెలిపింది. ఇదిలా ఉంటే.. ఈ ముద్దుగుమ్మ తన నటనతో , గ్లామర్‌తో అతి తక్కువ కాలంలోనే మంచి గుర్తింపు తెచ్చుకుంది. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలనే లక్ష్యంతో బీటెక్ పూర్తి చేసి, ఆపై హైదరాబాద్‌లోని ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేసింది అనన్య.నటనపై ఉన్న ఆసక్తితో షార్ట్ ఫిలిమ్స్ చేయడం ప్రారంభించారు. అలా ఆమె ప్రతిభను గుర్తించిన దర్శకుడు పద్మరాజన్, 2019లో వచ్చిన 'మల్లేశం' చిత్రంలో హీరోయిన్‌గా అవకాశం ఇచ్చారు. ఈ సినిమాలో మల్లేశం భార్య పాత్రలో ఆమె నటనకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి. కానీ పవన్ కళ్యాణ్ నటించిన వకీల్ సాబ్ చిత్రం మాత్రం అనన్య కెరీర్‌ను మలుపు తిప్పింది. ఇందులో ముగ్గురు అమ్మాయిలలో ఒకరైన 'దివ్య' పాత్రలో ఆమె అద్భుతంగా నటించి ప్రేక్షకులకు చేరువయ్యారు.


Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365